Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 152 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 21 - 1 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## అలాంటి వారికి దేశ రాజకీయాల్లో చోటు లేదు : నితిన్ నబీన్



**ఇంటర్నెట్ డెస్క్:** భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ సిన్హా ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఆయన జాతీయ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి ఆయన పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. భారత్ మాతాకీ జై అంటూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టిన ఆయన.. 'ముందుగా మీ అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఒక సాధారణ కార్యకర్తనైన నన్ను పార్టీలోనే అత్యంత ఉన్నతమైన పదవికి చేరేలా చేశారు. నేను మీకు తలవంచి నమస్కరిస్తున్నాను' అని అన్నారు.

**ప్రధాని మోదీపై ప్రశంసలు..**

జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా.. ప్రధాని మోదీపై ప్రశంసల జల్లులు కురిపించారు. ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధాని మోదీ నిరంతరంగా దేశం కోసం పాటుపడుతున్న తీరును సాధారణ కార్యకర్తలమైన తాము గమనిస్తూనే ఉన్నామన్నారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'అది నేను నేషనల్ జనరల్ సెక్రటరీగా ఉన్న సమయం. అప్పుడు మీరు(ప్రధాని మోదీ) సభావన మిషన్ ప్రోగ్రామ్ సందర్భంగా ప్రతీ ఒక్కరి కష్టాలను అడిగి తెలుసుకోవటం చూశాను. ఆ ప్రోగ్రామ్ తర్వాత మేము మీ గ్రీన్ రూములో మిమ్మల్ని కలిశాము. గుజరాత్ నుంచి చాలా మంది ఆ ప్రోగ్రామ్‌కు ఎందుకు వస్తున్నారో భావోద్వేగపూరితంగా మీరు మాకు వివరించారు. ప్రజల ఎమోషన్స్‌తో కనెక్ట్ అయ్యే వారే గొప్ప నాయకులు అవుతారని నాకు అప్పుడు అర్థమయింది' అని చెప్పారు. ఈ సందర్భంగా నితిన్ నబీన్ ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తమిళనాడు ప్రభుత్వం తిరుప్పర న్కుంద్రం కొండపై కార్తీగై దీపం పండుగ జరగకుండా ఆపడాన్ని ఆయన తప్పుబట్టారు. సోమనాథ్, రామసేతు, ఇతర చిహ్నాల గురించి మాట్లాడితే ప్రతిపక్ష పార్టీలు అసహనానికి గురవుతాయని అన్నారు. రామసేతు లేదు అనే వారికి, కార్తీగై దీపం పండుగను అడ్డుకునే వారికి భారత రాజకీయాల్లో చోటులేదని పేర్కొన్నారు.

## నాలెడ్జ్ ఎకానమీ దేశ ఆర్థిక వ్యవస్థనే మారుస్తోంది : సీఎం చంద్రబాబు




**ఇంటర్నెట్‌డెస్క్:** నాలెడ్జ్ ఎకానమీ మన దేశ ఆర్థిక వ్యవస్థనే మారుస్తోందని.. దీని ద్వారా సంపద సృష్టి జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. భారతీయులు, అందులోనూ తెలుగు ప్రజలు టెక్నాలజీని అందిపుచ్చుకోవటంలో ముందుంటారని పేర్కొన్నారు. టెక్నాలజీని సమర్థంగా వినియోగించుకుంటేనే అద్భుత ఫలితాలు సాధించేందుకు అవకాశముంటుందని ఆయన వెల్లడించారు. మంగళవారం.. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలతో ఏపీకి కావాల్సిన పెట్టుబడులపై చర్చించారు. భారత్ కేంద్రంగా అభివృద్ధి, ఏపీ సానుకూలతలపై మాట్లాడారు.

**కొత్త విషయాలు తెలుసుకుంటా..**

దశాబ్దాలుగా దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరవుతున్నానని సీఎం చంద్రబాబు తెలిపారు. దావోస్‌కు వచ్చిన ప్రతిసారీ పారిశ్రామికవేత్తలు, నిపుణుల నుంచి కొత్త విషయాలు తెలుసుకుంటానని.. కొత్త ఆలోచనలు పంచుకుంటానని వెల్లడించారు. టెక్నాలజీ సహా వివిధ రంగాల్లో వస్తున్న మార్పులను తెలుసుకుని పాలసీలు రూపొందిస్తానని వివరించారు. దావోస్‌లో ప్రపంచ పారిశ్రామికవేత్తల ఆలోచనలు అర్థం చేసుకుని ఏపీని బిజినెస్ ఫ్రెండ్లీ స్టేట్‌గా మారుస్తున్నామని చెప్పుకొచ్చారు. మరే దేశంలో లేని యువశక్తి భారత్‌లో ఉందని, దీంతో తిరుగులేని సమర్థ నాయకత్వం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఏ రంగంలో అయినా పెట్టుబడులకు భారతదేశం, ఆంధ్రప్రదేశ్‌లు అత్యుత్తమ గమ్యస్థానాలని చెప్పుకొచ్చారు. 2047కు భారత్ ప్రపంచ శక్తిగా మారుతుందని వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ గ్రోత్ స్టోరీని చూస్తారని తెలిపారు సీఎం.

**నిర్దిష్ట లక్ష్యాలతో పనిచేస్తున్నాం..**

గతంలో పారిశ్రామిక వేత్తలను ఏపీకి తేవాలంటే చాలా కష్టపడాల్సి వచ్చేదని చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం తెలుగు ప్రజల విజయాలు, ఏపీ బ్రాండ్ సానుకూలాంశంగా మారాయని వెల్లడించారు. ప్రతీ రంగంలో నిర్దిష్టమైన లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పుకొచ్చారు. తమకు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కావాలని.. అందుకు ఏపీకి రావాలని పిలుపునిచ్చారు. దీనికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని స్పష్టం చేశారు. గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తితో కొత్త చరిత్రకు నాంది పలికామని.. ఇక ప్రపంచ దేశాలకు ఎగుమతి చేస్తామని వ్యాఖ్యానించారు. వ్యవసాయం రంగంతో పాటు వైద్య రంగంలోనూ డ్రోన్లను ఉపయోగించబోతున్నామన్నారు.

**డ్రోన్ అంబులెన్స్‌పై ఆలోచన..**

2026లో డ్రోన్ అంబులెన్స్‌ను ఏపీలో ప్రారంభించే ఆలోచన చేస్తున్నామని తెలిపారు. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయని వివరించారు. 1000 కిలోమీటర్లకు పైగా సముద్ర తీరం, పోర్టులు, ఎయిర్‌పోర్టులు రాష్ట్రానికి ఉన్న బలమని పేర్కొన్నారు. వచ్చే నాలుగేళ్లలో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందని తెలిపారు. అక్కడ అమలు చేస్తున్న పాలసీలు, పెట్టుబడులకు ఉన్న సానుకూల పరిస్థితులను స్వయంగా చూడాలని పారిశ్రామిక వేత్తలను కోరారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లాంటి విధానాలను పరీక్షించాకే పెట్టుబడులపై నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏపీకి మించిన అత్యుత్తమ పెట్టుబడుల గమ్యస్థానం మరోకటి లేదని.. పారిశ్రామికవేత్తలకు ఏపీ అతిపెద్ద మార్కెట్ అవుతుందని చంద్రబాబు పేర్కొన్నారు.

## అమరావతిలో ఎన్టీఆర్ విగ్రహం..వైసీపీ ఫేక్ ప్రచారంపై ఏపీ ప్రభుత్వం ఫైర్

**అమరావతి, (రాజధాని వార్తలు):** దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు విషయంలో వైసీపీ దుష్ప్రచారంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అయింది. ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు నేపథ్యంలో కులాల మధ్య వైసీపీ చిచ్చుపెట్టేలా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తింది. ఫేక్ ఐడీలతో వైసీపీ సోషల్ మీడియా టీమ్ దుష్ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది.

**తెలుగు ప్రైడ్ థీమ్‌తో ఎన్టీఆర్ విగ్రహం..**

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు నిధుల సమీకరణపై ఏపీ ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. అమరావతిలో తెలుగు ప్రైడ్ థీమ్‌తో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. గుజరాత్ ప్రైడ్ పేరుతో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అదే తరహాలో తెలుగు ప్రైడ్ పేరుతో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేలా కూటమి సర్కార్ కసరత్తు చేస్తోంది. టూరిజాన్ని ఆకర్షించేలా.. ఎన్టీఆర్ విగ్ర హం, ఫ్యూచర్ మ్యూజియం వంటివి ఏర్పాటు చేయాలని భావిస్తోంది.




**పీపీపీ పద్ధతిలో..**

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు, పార్కును పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసేలా ఏపీ ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించింది. ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలని నీరుకొండ గ్రామస్తులు కూడా కోరారని ప్రభుత్వం స్పష్టం చేసింది. కులాల మధ్య చిచ్చు పెట్టేలా వైసీపీ వ్యవహరిస్తే... చర్యలు తీసుకోవాలని సర్కార్ భావిస్తున్నట్లు సమాచారం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఉండగానే దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఏర్పాటు చేసేందుకు గత జగన్ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందని కూటమి నేతలు గుర్తు చేశారు.

## గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌పై డిప్యూటీ సీఎం ఆదేశాలివే..

**అమరావతి, (రాజధాని వార్తలు):** గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 50 శాతం గ్రీన్ కవర్ ప్రాజెక్ట్‌లపై సంబంధిత అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంగళవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని గ్రేట్ గ్రీన్ వాల్ 2030 నాటికి రాష్ట్రంలోని 1,034 కి.మీ తీరప్రాంతంలో 5 కిలోమీటర్ల వెడల్పు గ్రీన్ బెల్ట్‌గా ఏర్పడి ప్రధాన పర్యావరణ ప్రాజెక్ట్‌గా రూపాంతరం చెందాలని పవన్ ఆదేశించారు. ఇది తుఫాన్‌లు, సముద్ర మట్టం పెరుగుదల, కోత నుంచి రక్షించడానికి 'జీవన పర్యావరణ కవచం'ను ఏర్పరుస్తుందని ఆయన అన్నారు. ఈ నిర్ణయం అమలయితే..జీవవైవిధ్యం, జీవనోపాధిని పెంచుతుందని ఆకాంక్షించారు. ఆఫ్రికన్ గ్రేట్ గ్రీన్ వాల్ చొరవ నుంచి ప్రేరణ పొందిందని.. మడ అడవులు, సరుగుడు, ఇతర ఉప్పునీటిని తట్టుకునే చెట్ల తోటలపై దృష్టి పెట్టాలని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు బుదితి రాజశేఖర్, కృష్ణబాబు సహా పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలెప్మెంట్ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్, ఇతర ఉన్న తాధికారులు పాల్గొన్నారు.

## నూతన ఆర్టీఐ కమిషనర్లచే ప్రమాణ స్వీకారం చేయించిన సిఎస్ విజయానంద్



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషన్ కు నూతనంగా నియమితులైన కమిషనర్లచే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ మేరకు మంగళవారం ఎపి సచివాలయంలో నూతన కమిషనర్లతో ప్రమాణం చేయించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషన్‌కు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ కమిషనర్ సహా ఇతర కమిషనర్లను నియమించడం జరిగింది.రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ వారి ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నూతన కమిషనర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు.రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ గా వజ్జా శ్రీనివాసరావుతో ముందుగా సిఎస్ విజయానంద్ ప్రమాణం చేయించారు. తదుపరి పరవాడ సింహాచలం నాయుడు,వంటేరు రవిబాబు, ఆదెన్న గాజుల, చరత్ చంద్ర కళ్యాణ చక్రవర్తి వట్టికూటిచే సమాచార కమిషనర్లుగా ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్లకు సిఎస్ పుష్పగుచ్చాలు అందించి రాష్ట్ర ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్వీసెస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, ఎపి సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామకృష్ణ, ఆర్టీఐ అధికారులు, నూతన ఆర్టీఐ కమిషనర్ల కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి నిర్మాణంలో బ్రిటన్ భాగస్వామ్యం.. మంత్రి నారాయణతో గారెత్ విన్ ఓవెన్ భేటీ



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెరిగింది. అంతర్జాతీయ సహకారంతో అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఈరోజు బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణతో భేటీ అయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో బ్రిటన్ వ్యవహారాలు చూస్తున్న గారెత్ విన్ ఓవెన్, మంత్రి నారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో అమరావతి గ్రోత్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. రాజధానిలో ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతిని, భవిష్యత్ ప్రణాళికలను ఓవెన్‌కు మంత్రి వివరించారు. ముఖ్యంగా రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ వంటి భారీ ప్రాజెక్టుల వివరాలను తెలుసుకున్న బ్రిటిష్ బృందం, వాటి పట్ల ప్రత్యేక ఆసక్తి కనబరిచింది. అమరావతి అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ హామీ ఇచ్చారు.






దావోస్‌లో 'ది ఆంధ్రప్రదేశ్ అడ్వాంటేజ్' అంశంపై సీఐఐ బ్రేక్ ఫాస్ట్ సెషన్‌లో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు






రాజధాని అమరావతిలో నిర్మాణంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు నివాసం - ఫోటో సేకరణ : ఎస్ ఆర్ ఆర్

# ఎన్టీఆర్ గుండెల్లో స్థానం - చరిత్రలో నిలిచిన సి.సి. నాయుడు

## - పదవులు కాదు...విశ్వాసమే ఆయన అసలైన గుర్తింపు



**వెంకటగిరి, (రాజధాని వార్తలు):** రాజకీయాల్లో ఎదుగుదల అనేది పదవు లతోనే కొలవాల్సిన సమీకరణం కాదు. కొన్ని వ్యక్తిత్వాలు అధి కార శిఖరాలకన్నా ముందే చరిత్రలో స్థానం సంపాదిం చుకుంటాయి. అలాంటి అరుదైన నేతల్లో ఒకరు సి.సి. నాయుడు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత మహానేత నంద మూరి తారక రామారావు రాజకీయ ప్రయాణం తొలి అడుగులు వేస్తున్న రోజుల్లోనే ఆయన విశ్వాసాన్ని సంపాదించిన విద్యార్థి నేతగా సి.సి. నాయుడు ప్రత్యేక గుర్తింపు పొందారు. గండిపేట లోని ఎన్టీఆర్ కుటీర పరిశ్రమ కేంద్రంగా సాగిన రాజకీయ శిక్షణలో, యువకుడిగా రాజకీయ ఓనమాలు నేర్చుకున్న నాయుడు అప్పుడే ఎన్టీఆర్ గుండెల్లో స్థిరమైన స్థానం దక్కించు కున్నారు. అది ఉద్యమాలే రాజకీయ భాషగా, సిద్ధాంతాలే నాయకత్వానికి పునాదిగా నిలిచిన కాలం. పదవుల కంటే పార్టీకి, లాభాల కంటే నిబద్ధతకు, అవకాశాల కంటే విశ్వాసానికి విలువ ఉన్న రోజులు. అలాంటి వాతావరణంలో ఎన్టీఆర్ దృష్టిని ఆకర్షిం చిన విద్యార్థి నేతగా సి.సి. నాయుడు తనదైన ముద్ర వేశారు. కాలక్రమేణా రాజకీయాలు మారాయి. వ్యవస్థలు మారాయి. నాయకత్వపు నిర్వచనాలు మారిపోయాయి. అయినప్పటికీ, నేటి వెంకటగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ అయిన సి.సి. నాయుడు రాజకీ యంగా ఆశించిన స్థాయిలో పదవులు పొందలేకపోయినా, ఆయనకు లభించిన గౌరవం మాత్రం తగ్గలేదు. అధికార పద వులు దూరమైనా, వ్యక్తిత్వానికి లభించిన గుర్తింపు మాత్రం చెక్కు చెదరలేదు. ఎన్టీఆర్ వంటి జాతీయ స్థాయి ప్రభావం కలిగిన మహానేతకు అత్యంత విశ్వసనీయుడిగా నిలవడం సాధారణ విషయం కాదు. ఆయన నమ్మకాన్ని సంపాదించుకోవడమే సి.సి. నాయుడి రాజకీయ జీవితానికి శాశ్వత ఆస్తిగా మారింది. నేటి రాజకీయాల్లో వేగమే ప్రమాణంగా మారిన వేళ, సిద్ధాంతాలకన్నా లెక్కలే ప్రధానంగా మారిన కాలంలో సి.సి. నాయుడు వంటి నేతల ప్రయాణం ఒక మౌన హెచ్చరికలా నిలుస్తోంది. రాజకీ యాల్లో ఎదగడం మాత్రమే కాదు, నిలబడటమే అసలైన విజయం అని, పదవులకన్నా వ్యక్తిత్వమే దీర్ఘకాల గుర్తింపునిస్తుందని ఆయన జీవితం స్పష్టం చేస్తోంది. అందుకే నాలుగు సార్లు ముఖ్య మంత్రి బాధ్యతలు నిర్వహించిన నారా చంద్రబాబు నాయుడు సైతం, "ఏం సి.సి బాగున్నావా?" అంటూ ఆత్మీయంగా పలకరిం చడమంటే అది కేవలం వ్యక్తిగత పరిచయం కాదు. సీనియర్ ఎన్టీఆర్‌తో సి.సి. నాయుడికి ఉన్న సాన్నిహిత్యం, విశ్వాసానికి లభించిన రాజకీయ గౌరవమే. అందుకే సి.సి. నాయుడు కథనం కేవలం ఒక వ్యక్తి గాథ కాదు అది ఒక తరం రాజకీయ సంస్కృతికి ప్రతిబింబం. నేటి యువ రాజకీయ నాయకత్వానికి ఒక నిశ్శబ్దమైన కానీ బలమైన పాఠం.

# యోగి వేమన బోధనలు సమాజానికి మార్గదర్శకాలు : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** యోగి వేమన బోధనలు సమాజానికి మార్గదర్శకాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. సోమ వారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో యువజన సర్వీసుల శాఖ, (సెట్నెల్) వారి ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్, వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ..యోగి వేమన తన సరళమైన పద్యాల ద్వారా సత్యం, నైతికత, సమానత్వం, మానవత్వం వంటి విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లారని తెలిపారు. కులమత భేదాలు, మూఢనమ్మకాలు, అజ్ఞానంపై ధైర్యంగా పోరాడిన సమాజ సంస్కర్తగా వేమన నిలిచారని పేర్కొన్నారు. వేమన రచించిన యోగి వేమన శతకం, తత్త్వ శతకంలలోని భావాలు నేటి సమా జానికి అత్యంత ముఖ్యమని, యువత వాటిని ఆదర్శంగా తీసుకో వాలని కలెక్టర్ సూచించారు. యోగి వేమన తన బోధనల ద్వారా తెలుగు సాహిత్యంలో, సమాజ చైతన్యంలో శాశ్వత స్థానం సంపా దించుకున్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసి మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్వో విజయకుమార్, సెట్నెల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నాగేశ్వరరావు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా యోగి వేమన జయంతి వేడుకలు



**గూడూరు, (రాజధాని వార్తలు):** తెలుగు భాషా ప్రవంతి ఆధ్వర్యంలో ఘనంగా యోగి వేమన 374వ జయంతి వేడుకలను చిలుకూరు మండలం పాలిచర్ల వారిపాలెం ఉన్నత పాఠశాలలో యోగి ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష నిర్వాహకులు, తెలుగు ఉపాధ్యాయులు ప్రజేంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రజా కవి, తత్వవేత్త, సత్యవాదిగా సమాజంలోని కుళ్ళును, మనుషుల వేషధారణలోని మోసాన్ని గమనించిన వేమన ప్రజల్లో చైతన్యం తీసుకు రావడానికి తన పద్యాలను ఆయుధంగా వాడి, సమాజంలో మూఢ నమ్మ కాలు, కుల వివక్షతపై తీవ్ర విమర్శ చేసి 'విశ్వదాభిరామ వినుర వేమ' అనే మకుటంతో ప్రజలకు సత్యమార్గాన్ని చూపించిన కర్మయోగి వేమన అని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు పి అనసూయ మాట్లాడుతూ వేమన జయంతి సందర్భంగా పాఠశాలలో విద్యార్థులందరికి, వేమన పద్యాల పై పోటీ, వ్యాసర చన, ప్రజా కవి వేమన అనే అంశంపై మాట్లాడడం, చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేయడం అభినందనీ యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగభూష ణమ్మ, చంద్రశేఖర్, మాధవయ్య, లావణ్య, సంధ్య, శ్రీనివాసులు, రవీంద్ర, లీల, సుగుణ, కామేశ్వరి, విద్యుల్లత, డివి రమణయ్య, మధుసూదన్ రావు, మధు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విద్యతోపాటు అధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి




**గూడూరు, (రాజధాని వార్తలు):** న్నారి విద్యార్థులకు విద్యతో పాటు అధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని నెల్లూరు మదీనా వాచ్ అధినేత హాజీ ఇంతియాజ్ అన్నారు. గూడూరు మండలం విందూ రులో విద్యతో పాటు ఖురాన్ పవిత్ర గ్రంథాన్ని అభ్యసించిన విద్యార్థులను సినిమా నుంచి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విందూరులాంటి కుగ్రా మంలో ఆనందకరమైన వేడుకను నిర్వహించారని మత గురువుల సేవలను కొనియాడారు. విందూరు గ్రామంలో ముస్లిం సోదరు లకు పండగ వాతావరణం నెలకొంది. చిన్ననాటి నుండే పిల్లలు ధార్మిక విద్యపై ఆసక్తి పెంచుకోవాలని, దీన్-ఏ-ఇస్లాం మార్గంలో నడుచుకోవాలని ఆకాంక్షిస్తూ మదీనా వాచ్ అధినేత షేక్ ఇంతి యాజ్, వారి మిత్ర బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిం చారు. గ్రామంలోని అబూబకర్ సిద్దిక్ మజీద్‌లోని ఖురాన్ పూర్తి చేసి, సూరాలను నేర్చు కున్న 3 నుండి 10 సంవత్సరాలలోపు వయసున్న చిన్నారులను ప్రోత్సహించేందుకు డాక్టర్ షేక్ ఇంతియాజ్, వారి మిత్రులు సొంత ఖర్చులతో తోఫాలు (బహుమ తులు) అందజేశారు. 70 మంది పిల్లలు ఖురాన్ చదువుతున్న, పిల్లలను చెన్నై, గూడూరు, నెల్లూరు నుండి వచ్చిన ముస్లిం మత పెద్దలు గ్రామంలోని పిల్లలను అభినందించారు. గ్రామంలోని ముస్లిం సోదరులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో 20 మంది పిల్లలు పైగా ఖురాన్ (గ్రంథం) పూర్తి చేసిన శుభ సందర్భంగా పిల్లలకు మత పెద్దలు బహుమతు లను అందజేశా రు. ఈ సందర్భంగా మైనార్టీ లీడర్ మదీనా వాచ్ హాజీ ఇంతి యాజ్ మాట్లాడుతూ విందురు గ్రామంలోని మదర్స వారికి పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. ముందుగా పిల్లల తల్లిదండ్రు లకు కృతజ్ఞతలు తెలిపారు. చాలా చక్కగా పిల్లలను క్రమశిక్షణ నేర్పించారని, చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ అరబ్బీ, ఇంగ్లీష్, తెలుగు మాట్లాడడం సమాజానికి చాలా అవసరం అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను మరెన్నో జరపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ లతీఫ్, షహాబుద్దీన్, తమీజుల్ హాక్, షఫీ మౌలానా, గ్రామ ప్రజలు, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల ఇళ్లకు రక్షణ కల్పించండి : సిపిఎం డిమాండ్

**తిరుపతి, (రాజధాని వార్తలు):** సత్యవేడు మండలంలోని మదనంబేడు గ్రామ గిరిజనుల ఇళ్లకు రక్షణ కల్పించాలని మండల కేంద్రం లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం మండల కార్యదర్శి మెలుగు రమేష్ గిరిజనుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మెలుగు రమేష్ మాట్లాడుతూ మధనంబేడు గ్రామంలో గిరిజనులు నివా సం ఉంటున్న ఇండ్లను కూల్చివేసి వారిపై దాడికి పాల్పడటానికి తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ గ్రామంలో ఉండడానికి ఇల్లు లేని నిరుపేద గిరిజనులు ఆ గ్రామ రెవెన్యూ పరిధిలోని కొంత ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న నేపథ్యంలో అది ఓర్వలేని ఆ గ్రామానికి చెందిన కొంతమంది అగ్రకుల పెత్తందారులు ఆకతాయిలను పురిగొల్పి గిరిజనుల ఇళ్లను కూల్చివేసి వారిపై దాడికి పాల్పడటం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ గ్రామంలో ప్రభుత్వ భూములను యదేచ్ఛగా ఆక్రమించుకుంటూ అమ్ముకుంటున్నటువంటి దుర్మార్గులను ప్రశ్నించని రెవెన్యూ అధికారులు గిరిజనులు వేసుకున్న గుడిసె లను ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడటం ఏంటని ప్రశ్నిం చారు. గత ప్రభుత్వాలు గిరిజనులకు ఇళ్ల స్థలాలు కేటాయించ డంలో పూర్తిగా విఫలమైన నేపథ్యంలో కూటమి ప్రభుత్వమన్న తమకు ఇళ్ల స్థలాలు ఇస్తుందని ఆశించిన గిరిజనులకు నిరాశే మిగిలిందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం తీరు ఇలా ఉంటే మరి నిరుపేదల పక్షాన నిలబడి వారికి ఇళ్ల స్థలాలు ఇప్పించవలసిన



నాయకులు గిరిజనుల ఇళ్లను కూల్చడంలో వారు పాములు కదపటంలో కుల వివక్షత తేటతెల్లంగా బహిర్గతం అవుతోందని తెలిపారు. ఇలాంటి చర్యలను సిపిఎం పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తు న్నట్లు తెలిపారు. గతంలో తహసిల్దార్‌కు, కలెక్టర్‌కి అనేక మార్లు వినతులు సమర్పించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు నిరుపేద గిరిజనులకు ఇళ్ల పట్టాలు ఇప్పించి వారికి రక్షణ కల్పించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చొరవ చూపాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున నిరసన కార్యక్ర మాలు చేపడుతామని హెచ్చరించారు. తదనంతరం తహసిల్దార్ రాజశేఖర్ కు గిరిజనులు వినతి పత్రం సమర్పించారు. తాహసిల్దార్‌ను వివరణ కోరగా సమగ్ర విచారణ చేసి లబ్ధిదారులకు తప్పక ఇళ్లస్థల పట్టాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మునస్వామి, తిరుమలరెడ్డి మధనంబేడు గ్రామ గిరిజనులు పాల్గొన్నారు.

# అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులకు ఆహ్వానం




**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** స్థానిక ఎస్వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రం బోధించుటకు అతిథి అధ్యాపకుల నుండి దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ 55 శాతం మార్కులు మరియు నెట్ లేదా సెట్ లేదా పీహెచ్డీ అర్హత కలిగి ఉండాలని ఆసక్తిగల అభ్యర్థులు కళాశాలకు తమ అర్హత గల సర్టిఫికెట్స్‌తో 22.01.2026 న ఉదయం 11 గంటలకు కళా శాలకు హాజరు కావాలని మరిన్ని వివరాలకు 9440133142 సంప్రదించాలని కోరారు.

# ఇద్దరు డ్రైవర్లకు జైలు శిక్ష : మేజిస్ట్రేట్ ఏ.విజయ్ రాజ్ కుమార్

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గజపతినగరం సర్కిల్ పరిధి లోని జాతీయ రహదారిపై కొన్ని నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులైన ఇద్దరు డ్రైవర్లకు స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏ.విజయ్ రాజ్ కుమార్ మూడు నెలల జైలు శిక్ష విధించారు. కోర్టు కార్యాలయ సిబ్బంది అందించిన వివరాల ప్రకారం,గజపతినగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై కారు, మోటార్ సైకిలిస్ట్ ఢీకొన్న ప్రమాద ఘటనలో వంగర సాంబశివరావు అనే కారు డ్రైవర్‌కు మూడు నెలల జైలు శిక్ష, 500 రూపాయలు జరిమానా విధిస్తూ స్థానిక మెజిస్ట్రేట్ విజయ్ రాజ్ కుమార్ సోమవారం తీర్పు చెప్పారు. అలాగే పెదమానాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి వద్ద రెండు లారీలు ఢీకొన్న ప్రమాద ఘటనలో లారీ డ్రైవర్ బెహరా కృష్ణకు మూడు నెలల జైలు శిక్ష విధించారు.



# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 81 ఫిర్యాదులు



**తిరుపతి, (రాజధాని వార్తలు):** జిల్లా పోలీసు ప్రధాన కార్యాల యంలో సోమవారం నిర్వహించిన మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు స్వయంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వివిధ ఫిర్యాదులను ఎస్పీ వ్యక్తిగతంగా విని, వాటిపై సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని స్పష్టం చేస్తూ, వికలాంగులు, వృద్ధులు, మహిళల సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో మొత్తం 81 ఫిర్యాదులు స్వీకరించబడి నట్లు తెలిపారు. వాటిని పరిష్కారం నిమిత్తం సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవి మనోహర చారి శాంతిభద్రతలు శ్రీనివా సులు, సంబంధిత సీఐలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# సంక్షేమం అభివృద్ధికి ఆద్యుడు అన్న "నందమూరి"

## - మాజీ మంత్రి, జనసేన పిఎసి సభ్యురాలు పడాల అరుణ



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** సంక్షేమం, అభివృద్ధికి ఆద్యుడు అన్న "నందమూరి" తారక రామారావు అని ఆంధ్రుల ఆరాధ్య దైవం, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా ఆయన పేరు ప్రఖ్యాతులు గడించారు అని మాజీ మంత్రి, జనసేన పిఎసి సభ్యురాలు పడాల అరుణ అన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా స్థానిక జాతీయ రహదారి వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆమె ఘనంగా నివాళులర్పిం చారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు మునకాల జగన్నాధరావు, కార్యనిర్వాహక సభ్యులు మామిడి దుర్గాప్రసాద్, ఆంధ్ర జలాశయం నీటి పారుదల సంఘం డైరెక్టర్ తాళ్లపూడి త్రివేది, మండల లక్ష్మనాయుడు, పైల చిన్న, హాస్పిటల్ కమిటీ మాజీ చైర్మన్ మిత్తిరెడ్డి వెంకటరమణ, సీనియర్ నాయకులు సత్యనారాయణ, ఈశ్వర్రావు, మహేష్, సూర్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అన్ని డివిజన్లలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు : మేయర్ రూప్ కుమార్ యాదవ్











**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రతి రోజూ ఫాగింగ్ ప్రక్రియను అమలు చేస్తూ, ఆయిల్ బాల్స్ పిచికారి, డ్రైను కాలువల పూడికతీత తదితర కార్యక్రమాలతో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నామని మేయర్ రూప్ కుమార్ యాదవ్ తెలియజేశారు. కమిషనర్ వైఓ నందన్ నెల్లూరు నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం నిర్వహించారు.

సమీక్ష సమావేశంలో టిడిపి రూరల్ నియోజకవర్గ ఇన్చార్జి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పట్టణ పురపాలక శాఖ మంత్రివర్యులు నారాయణ, రూరల్ నియోజకవర్గం శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిల ఆలోచనల మేరకు నగర వ్యాప్తంగా దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అందరి అభిప్రాయాలను చర్చించి ప్రణాళికలను రూపొందించేందుకు సమావేశాన్ని నిర్వహించామని తెలిపారు. నగరవ్యాప్తంగా దోమల నివారణతో పాటు వీధి కుక్కల నియంత్రణ, రోడ్లపై పశువుల సంచారం, ప్రజలను ఇబ్బంది పెట్టే కోతుల సంచారం అంశాలపై పటిష్టమైన కార్యాచరణను రూపొందించి, స్థానిక కార్పొరేటర్‌లను సమన్వయం చేసుకుంటూ అమలు చేయనున్నామని స్పష్టం చేశారు. టిడిపి రూరల్ నియోజకవర్గ ఇన్చార్జి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు లోకేష్ నారాయణ రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిల సహకారంతో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అత్యంత వేగవంతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. అయితే దోమలతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతూ రూరల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రధాన సమస్యగా ఈ అంశాన్ని తెలియజేస్తున్నారని వివరించారు. నగర పాలక సంస్థ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో ప్రణాళిక బద్ధంగా దోమల నిర్మూలనకు చర్యలను అత్యంత వేగవంతంగా తీసుకునేలా అధికారులతో సమీక్షించమని తెలిపారు.

స్థానిక సమస్యలపై కార్పొరేటర్లకు లేదా రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం వాట్సాప్ నెంబర్‌కు సమాచారం అందిస్తే తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కమిషనర్ వై.ఓ. నందన్ మాట్లాడుతూ నెల్లూరు నగర పాలక సంస్థ పరి ధిలోని 54 డివిజన్లను 9 జోన్లుగా విభజించి దోమల నిర్మూల నకు శానిటేషన్ సిబ్బంది ద్వారా ప్రత్యేక కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించేందుకు నిర్ణయించామని తెలిపారు. నూతనంగా కొనుగోలు చేసిన 50 ఫాగింగ్ మిషన్‌లతోపాటు గతం నుంచి వినియోగిస్తున్న భారీ ఫాగింగ్ మిషన్లు కూడా ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతిరోజు డివిజన్ల వారీగా క్షేత్రస్థాయిలో జరిపే డ్రైను కాలువలలో దోమల మందు పిచికారి, ఫాగింగ్ ప్రక్రియ పూర్తి వివరాలను కార్యాలయంలోని ఉన్నతాధికారులు తప్పనిసరిగా పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. అన్ని డివిజన్లలో క్రమం తప్పకుండా డ్రైన్ కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను చేపట్టాలని, ఖాళీ స్థలాలలో చేరిన మురుగునీటిని యజమానులు తొలగించేలా, తడి పొడి వ్యర్థాలను విడివిడిగా సేకరించేలా సిబ్బందిని పర్యవేక్షిస్తామని కమిషనర్ వివరించారు. ఈ సమావేశంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, మలేరియా విభాగం డాక్టర్ జిజియా, వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్మోహన్, శానిటేషన్ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న టి.డి.పి. సూళ్లూరుపేట నియోజకవర్గ యువ నాయకులు నెలవల రాజేష్





**దక్కిలి, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా, దక్కిలి మండలం, లింగసముద్రం గ్రామానికి చెందిన నావూరు. గౌతమ్ అనే 14 సంవత్సరాల బాలుడు గత 5 సంవత్సరాలుగా బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్నాడు. ఈ విషయాన్ని స్వయంగా తానే తెలుసుకుని పార్టీలకు, ప్రాంతాలకు అతీతంగా తన స్వంత డబ్బులతో గతంలో నుంచి ప్రస్తుతానికి కూడా వైద్యం చేయించి భవిష్యత్తు ట్రీట్మెంట్‌కి భరోసా కల్పించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రెండన్నర లక్షలు ఆర్థికంగా చికిత్స కొరకు విడుదల చేయించి చెక్‌ను ఆ అబ్బాయి తండ్రికి అందించడం జరిగింది. చికిత్స మొదలైన అప్పటి నుంచి పూర్తి అయ్యేవరకు బాధ్యతగా అండగా నిలిచినా



నెలవల. రాజేష్‌కి అబ్బాయి తండ్రి నావూరు. శంకర్ జీవితాంతం రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలియజేసారు.


# నారాయణ జిఎం వేమిరెడ్డికి ఘన సత్కారం





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నూతన సంవత్సర సంక్రాంతి పర్వదినాల సందర్భంగా నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డిని సోమవారం ఆ సంస్థ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. నగరంలోని స్థానిక రామలింగాపురం నందుగల నారాయణ కాన్సెప్ట్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో నారాయణ గ్రూప్ జిఎం వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఉపాధ్యాయులు సిబ్బంది నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం వేమిరెడ్డి మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థల ఉన్నతికి అధ్యాపకుల కృషి ఎనలేనిది అన్నారు. ప్రతి ఏడాదిలాగానే ఈ ఏడాది కూడా ఉత్తమ ఫలితాలను అందిపుచ్చుకునేందుకు కృషి చేయాలని సూచించారు. అలాగే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి వారి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. నారాయణ కాన్సెప్ట్ స్కూల్ ప్రాంగణం పండుగ వాతావరణంతో సందడిగా మారింది. విద్యా రంగంలో నారాయణ గ్రూప్ అభివృద్ధికి వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి అందిస్తున్న, సేవలను గుర్తిస్తూ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏజిఎం నరేంద్ర రెడ్డి, ప్రిన్సిపాల్ వెంగల రావు, సోనీతో పాటు నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌కు చెందిన ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా కేక్ కట్ చేసి, అనంతరం పుష్పగుచ్ఛాన్ని అందజేసి నారాయణ గ్రూప్ జిఎం వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డికి నూతన సంవత్సరం మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని నారాయణ గ్రూప్ తీసుకుంటున్న నిర్ణయాలు, విద్యా ప్రమాణాల మెరుగుదలకు చేస్తున్న కృషి ప్రశంసనీయం అని పేర్కొన్నారు. నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ నిరంతర ప్రగతిలో వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి పాత్ర కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమం స్నేహపూర్వక, ఆత్మీయ వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. నూతన సంవత్సరం మరియు సంక్రాంతి పర్వదినాలు నారాయణ గ్రూప్‌కు, సిబ్బందికి, విద్యార్థులకు మరిన్ని విజయాలు, ఆరోగ్యం, శుభఫలితాలు తీసుకు రావాలని ఆకాంక్షించారు.

# వన్ విలేజ్.. 4 విజిట్స్‌లో ప్రజల సమస్యలను పరిష్కరించాలి






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వన్ విలేజ్.. 4 విజిట్స్ కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ హాలులో వన్ విలేజ్.. 4 విజిట్స్, రెవెన్యూ పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ, పిజిఆర్ఎస్ అర్జీలు, యూరియా నిల్వలు, చాంపియన్ ఫార్మర్ కార్యక్రమం, గృహ నిర్మాణాల ప్రగతి తదితర అంశాలపై ఆర్డీవోలు, కమిషనర్లు, ఎంపిడివోలు, తహశీల్దార్లు, వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వన్ విలేజ్.. 4 విజిట్స్ కార్యక్రమంలో ప్రజలు, రైతులు తెలియజేసిన రెవెన్యూ సంబంధిత సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే పరిష్కరించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ నెలలో ఈ కార్యక్రమం నిర్వహించిన గ్రామాల్లో ఎలాంటి పెండింగ్ లేకుండా సమస్యల పరిష్కారం జరగాలని స్పష్టం చేశారు. జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రైతుల అవసరాలకు అనుగుణంగా సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. చాంపియన్ ఫార్మర్లను ప్రోత్సహిస్తూ, వారి ద్వారా మిగిలిన రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించాలని సూచించారు. పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యంగా,



బాధ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి ఎండార్సు మెంట్లు ఇవ్వాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతి సమస్య మళ్లీ పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని తెలిపారు. పరిష్కారం సాధ్యం కాకపోతే స్పష్టమైన కారణాలతో కూడిన ఎండార్సుమెంట్‌ను అర్జీదారునికి అందజేయాలని ఆదేశించారు. జిల్లాలో గుర్తించిన నాణ్యత లోపం ఉన్న గృహ నిర్మాణాలను సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుని మరమ్మతులు పూర్తి చేయించాలని హౌసింగ్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిఆర్‌ఓ విజయ్‌కుమార్, జడ్పీ సీఈఓ శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, పశుసంవర్ధక శాఖ జెడి రమేష్ నాయక్, ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మూఢనమ్మకాలు, అజ్ఞానంపై ధైర్యంగా పోరాడిన సమాజ సంస్కర్తగా వేమన



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** యోగి వేమన తన సరళమైన పద్యాల ద్వారా సత్యం, నైతికత, సమానత్వం, మానవత్వం వంటి విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లారని తెలిపారు. కులమత భేదాలు, మూఢనమ్మకాలు, అజ్ఞానంపై ధైర్యంగా పోరాడిన సమాజ సంస్కర్తగా వేమన నిలిచారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో యువజన సర్వీసుల శాఖ, (సెట్నెల్) వారి ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్, వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ యోగి వేమన బోధనలు సమాజానికి మార్గదర్శకాలని అన్నారు. వేమన రచించిన యోగి వేమన శతకం, తత్వ శతకంలలోని భావాలు నేటి సమాజానికి అత్యంత ముఖ్యమని, యువత వాటిని ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. యోగి వేమన తన బోధనల ద్వారా తెలుగు సాహిత్యంలో, సమాజ చైతన్యంలో శాశ్వత స్థానం సంపాదించుకున్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసి మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్వో విజయ కుమార్, సెట్నెల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నాగేశ్వర రావు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విఎస్సార్‌లో ఘనంగా క్రీడా దినోత్సవం

**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు రెండో పట్టణ పరిధిలోని వీరారెడ్డిపల్లి ప్రాంతంలో ఉన్న వీ.ఎస్సార్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. క్రీడా పతాకం, జ్యోతి వెలిగించారు. విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొని ప్రతిభ కనపరిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన విశ్రాంత వ్యాయామ డైరెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బాలక్రిష్ణం రాజు, తదితరులు



పాల్గొన్నారు.

# సంపాదకీయం

## విధాన వైకల్యాలలో భారత దౌత్యనీతి

భారత విదేశాంగ విధానం ఎవరి పర్యవేక్షణలో అమలు అవుతున్నది? ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని స్ఫుటంగా వ్యక్తీకరించడంలో, గట్టిగా సమర్థించడంలో ప్రభావదాయక పాత్ర నిర్వహిస్తోన్న విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నది ఆ ప్రశ్నకు స్పష్టమైన సమాధానంగా కనిపిస్తోంది. అయితే సౌత్ బ్లాక్ (విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ నెలవు) విధానాలను నిర్ణయిస్తున్నది, నిర్దేశిస్తున్నది ఎవరు అని జైశంకర్ సైతం ఆశ్చర్యపోక తప్పని పరిణామాలు సంభవిస్తున్న రోజులివి. బంగ్లాదేశ్‌తో సంబంధాల విషయంలో నెలకొన్న దౌత్యపరమైన గందరగోళ పరిస్థితులే అందుకొక తాజా నిదర్శనం. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియాకు నివాళులర్పించేందుకు జైశంకర్ 2025 డిసెంబర్ 31న ఢాకా వెళ్లారు. ఖలీదా మృతిపట్ల సంతాపం తెలుపుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాసిన ఒక వ్యక్తిగత లేఖను ఆమె కుమారుడు తారిక్ రెహమాన్‌కు జైశంకర్ అందజేశారు. బంగ్లాదేశ్ భావి ప్రధాని అని అందరూ విశ్వసిస్తున్న తారిక్ రెహమాన్‌తో జైశంకర్ కరచాలనం చూస్తే, క్షీణించిన భారత్?బంగ్లాదేశ్ ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడే సూచనలు కనిపించాయి. ఇది జరిగిన రెండు రోజులకే బంగ్లాదేశ్ స్టార్ క్రికెటర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను తాను కాంట్రాక్ట్ తీసుకున్న క్రీడాకారుల జాబితా నుంచి తొలగించాలని ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)ను భారత్ క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆదేశించింది. ఆ ప్రైవేట్ ఫ్రాంచైజీ మరో ఆలోచన చేయకుండా ఆ ఆదేశాన్ని శిరసా వహించింది. దీనిపై బంగ్లాదేశ్ ప్రభుత్వం తీవ్రంగా ప్రతిస్పందించింది. ముస్తాఫిజుర్ రెహమాన్ తొలగింపునకు నిరసనగా తాము టీ 20 మ్యాచ్‌లు భారత్‌లో ఆడబోమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ ప్రకటించింది. సహజంగానే ఒక ప్రశ్న అనివార్యమవుతోంది. కేవలం 48 గంటల వ్యవధిలో అత్యున్నత స్థాయి దౌత్య సమావేశం, ఒక క్రికెటర్‌ను లక్ష్యంగా చేసుకున్న ఒక నిష్కారణ నిర్ణయం తీసుకోవడానికి మధ్య ఏమి జరిగింది. బంగ్లాదేశ్ ఆగ్రహపూరిత ప్రతిస్పందనను ప్రేరేపించింది ఏమిటి? చోటుచేసుకున్న మార్పుకు కారణమేమిటి? అంటే, హిందుత్వ తీవ్రవాదులు బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా ప్రారంభించిన ప్రచారోద్యమమేనని చెప్పక తప్పదు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఢాకాలో ఎటువంటి రాజీ లేకుండా కఠిన వైఖరితో వ్యవహరించాలని మోదీ ప్రభుత్వాన్ని ఈ హిందుత్వ శక్తులు గట్టిగా డిమాండ్ చేశాయి. కేకేఆర్‌పై ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ శాసనసభ్యుడు సంగీత్ సోమ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రత్యేకించి దాని యజమాని, బాలీవుడ్ సూపర్‌స్టార్ షారుఖ్ ఖాన్‌ను తీవ్రంగా తప్పు పట్టారు. ముస్తాఫిజుర్ రెహమాన్‌తో కాంట్రాక్టు కుదుర్చుకున్న షారుఖ్ ఖాన్‌ను 'దేశ ద్రోహి' అని సంగీత్ సోమ్ ఆరోపించారు. అయితే కేకేఆర్‌కు షారుఖ్ ఖాన్ ఒక్కడే యజమాని కాదని, ఇంకా ఇద్దరు యజమానులున్నారని, వారు బాలీవుడ్ నటి జూహీ చావ్లా, ఆమె భర్త జై మెహతా అనే విషయాన్ని సంగీత్ సోమ్ తెలివిగా విస్మరించారు. మీ పేరులో ఖాన్ అని ఉంటే చాలు హిందుత్వ తీవ్రవాదుల కోపావేశాలకు మీరు తప్పక లక్ష్యమవుతారు సుమా! సాధారణ సమయాల్లో వివేచనాయుతమైన ప్రభుత్వం హిందుత్వ తీవ్రవాదుల వీరాలాపాలను విస్మరించి ఉండేది. అయితే 'న్యూ' ఇండియాలో ఈ అప్రధాన హిందుత్వ శక్తులే 'ప్రధాన స్రవంతి'గా భాసిల్లుతున్నాయి! విషపూరిత మతతత్వ రాజకీయాలకు వత్తాసునిస్తున్న ప్రభుత్వం, తనకు సంపూర్ణ మద్దతుదారులు అయిన సామాజిక మాధ్యమాలలో చెలరేగిపోయే సంఘ్ పరివార్ శ్రేణుల డిమాండ్లను విస్మరించలేదు. మరి ఈ సామాజిక మాధ్యమాలలో వ్యక్తమవుతున్న ఆగ్రహావేశాలు విదేశాంగ విధాన నిర్ణయాలను ప్రభావితం చేయడం ఒక అవాంఛనీయ పరిణామం. అది చాలా ప్రమాదకరమైనది. విదేశాంగ విధానానికి ప్రధాన బాధ్యులలో ఒకరైన విదేశాంగ మంత్రి స్వయంగా ఢాకా వెళ్లి బాధ్యతాయుత నాయకులు, అధికారులతో చర్చలు జరపడాన్ని పరిగణనలోకి తీసుకోవల్సిన విషయం కాదన్నట్టుగా బీజేపీ మద్దతుదారులు వ్యవహరించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? రాజకీయ ప్రయోజనాల కోసం, మొరటు రాజకీయాలతో సంబంధంలేని ఒక క్రికెటర్‌తో సహా బంగ్లాదేశీయుల పట్ల వ్యతిరేకతను రెచ్చగొట్టడం సరైన విషయమేనా? రాజకీయాల నుంచి క్రీడా రంగాన్ని వేరు చేయాలి. నిజమే. ఇదొక సర్వసాధారణమైన వాదన. అయితే భారత ఉపఖండంలో క్రీడలు, మరీ ముఖ్యంగా క్రికెట్ భారతీయ 'సాఫ్ట్ పవర్' (ఒక దేశ సంస్కృతి, రాజకీయాల, విదేశాంగ విధాన ప్రభావశీలత)కు స్పష్టమైన నిదర్శనంగా ఉన్నప్పుడు రాజకీయాల నుంచి క్రీడలను వేరు చేయడం అంత సులువు కాదు. ప్రపంచ క్రికెట్ వ్యవహారాలను, బీసీసీఐని నిర్దేశిస్తున్నది? అంతర్జాతీయ క్రికెట్ మండలి ఛైర్మన్‌గా ఉన్న జై షా (కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుమారుడు). క్రికెట్ జగత్తులో ఇప్పుడు ఆయనే మహా శక్తిమంతమైన వ్యక్తి. ఆసియా కప్ మ్యాచ్ ముగిసిన అనంతరం పాకిస్థానీ క్రికెటర్లతో కరచాలనం చేసేందుకు భారతీయ క్రికెటర్లు నిరాకరించడమైనా, బంగ్లాదేశ్ స్టార్ క్రికెటర్ కాంట్రాక్టు రద్దు చేయడమైనా భారతీయ క్రికెట్ అధిపతుల మాటే తుదిమాట అన్నది స్పష్టమయింది. క్రికెట్ ప్రపంచంలో తనకు లభించిన 'సూపర్ పవర్' హోదాను భారత్ దుర్వినియోగం చేస్తోందని చెప్పి తీరాలి. భారత ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న రాజకీయ పార్టీ అలా వ్యవహరించడం గర్హనీయం. ముస్తాఫిజుర్ రెహమాన్‌ను తొలగించాలన్న నిర్ణయం, ఐపీఎల్ బాధ్యులతో సంప్రదించిన తరువాత తీసుకున్నది కాదు. రాజకీయ నాయకత్వం తమకు జారీ చేసిన ఆదేశాన్ని ఎటువంటి ఆలోచన లేకుండా వెనువెంటనే తీసుకున్నది అనడంలో సందేహం లేదు.

# 23న ఎస్.సి/ఎస్.టి సమస్యలపై ప్రత్యేక పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమం




**తిరుపతి, (రాజధాని వార్తలు):** ఈ నెల 23వ తేదీ శుక్రవారం ఎస్.సి/ ఎస్.టి సమస్యలపై ప్రత్యేక పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటుందని ఈ కార్యక్రమానికి పోలీస్, అటవీ శాఖ అధికారులు, జిల్లా అధికారులందరు హాజరు కావాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, రెవెన్యూ డివిజన్, మండల, తదితర అధికారులతో వర్చువల్‌గా ప్రజా సమస్యల పరిష్కార వేదిక పి.జి.ఆర్.ఎస్ అర్జీలు పరిష్కారంపై జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్, మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్య, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్సీ, డి ఆర్ ఓ నరసింహులుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా రీ ఓపెన్‌కి ఆస్కారం లేకుండా నాణ్యతతో పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని పి.జి.ఆర్.ఎస్‌లో వచ్చిన అర్జీలను నాణ్యతతో గడువులోగా పరిష్కారం చూపాలని, ఎలాంటి అలసత్వం ఉండరాదని తెలిపారు. పరిష్కారం చూపలేని అర్జీదారునికి స్పష్టంగా ఎండార్స్మెంట్ చేసి తెలపాలని, తప్పుడు ఎండార్స్మెంట్ ఇవ్వరాదని ఆదేశించారు. రీ ఓపెన్‌కి తావు లేకుండా పరిష్కారం చూపాలని అన్నారు. ప్రతి సోమవారం అన్ని మండల పరిధిలో, డివిజన్ పరిధిలో తప్పనిసరిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించాలని, ఈ కార్యక్రమం నిర్వహించు ప్రదేశం, సమయం అర్జీదారులకు తెలిసేలా సమాచారం ఇవ్వాలి అని అన్నారు. అర్జీదారులు వారి సమస్యకు పరిష్కారం కొరకు పీజీఆర్ఎస్‌కు రావడం జరుగుతుందని సంబంధిత అధికారులు అర్జీ దారునితో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను సావధానశీగా విని సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపాలని అన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఎకు వెళ్లకుండా రోజువారీగా అర్జీలను రిఓపెన్ చేసి చూసుకుని పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తప్పుడు ఎండార్స్‌మెంటు లేకుండా చూడాలని అన్నారు. రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఐ.వి.ఆర్.ఎస్, పి 4, సర్వే, టెంపుల్, హెల్త్ తదితర అంశాలపై అధికంగా పిర్యాదులు వస్తున్నందున సంబందిత సచివాలయ సిబ్బంది ఐ.వి.ఆర్.ఎస్. పైన అవగాహన కలిగి ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని, ఎటు వంటి పిర్యాదులు రాకుండా చూడాల్సిన బాద్యత సంబందిత శాఖల వారిదేనని సూచించారు. మార్చి 16వ తారీఖు నుండి ప్రారంభం కానున్న 10వ తరగతి పరీక్షలలో మంచి ఫలితాలు వచ్చేలా విద్యార్థిని విద్యార్థులకు జిల్లాలోని ఉపాధ్యాయులు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని అందరూ తహశీల్దారులు రీ సర్వే అయిన గ్రామాలలో ప్రతి నెల 2వ తేదీ నుండి 9వ తేదీ వరకు పట్టాదారు పాసు పుస్తకాలను ఈ.కె.విసి ద్వారా అందించాలని అన్నారు. సిబ్బంది కొరత ఉన్నచో సంబందిత మండల ఎం. పి. డి. ఓ ల సిబ్బందిని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ నెల 23వ తేదీన ఉద్యోగస్థుల పరిష్కార వేదిక సాయంత్రం 4 గంటలకు నిర్వహించడం జరుగుతుందని, ఉద్యోగుల సమస్యలకు సంబందించిన అంశాలను పరిష్కారం కొరకు ఈ కార్యక్రమం నిర్వహణ జరుగుతుందని కావున జిల్లా అధికారులు, సంబందిత సెక్షన్ అధికారులు తప్పక హాజరై ఉద్యోగస్తులపై మోపబడిన అభియోగలకు సంబందించిన పత్రాలను తీసుకు రావాలని అన్నారు. ఈ సమావేశంలో తిరుపతి ఆర్. డి. ఓ రామ్మోహన్, డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ రోస్మాండ్, డ్వామా పి.డి శ్రీనివాస ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్‌రావు, డి.ఈ.ఓ కుమార్,ల్యాండ్ అండ్ సర్వే అధికారి అరుణ కుమార్ సంబందిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నైని బ్లాక్ వివాదంపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలి : టీ బీజేపీ చీఫ్

**ఢిల్లీ :** కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. సింగరేణి అవినీతిలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లది సమాన పాత్ర ఉందంటూ ఆయన విమర్శించారు. మంగళవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'సింగరేణిలోని నైని బ్లాక్ వివాదంపై సీబీఐ లేదంటే ఏదైనా సంస్థతో దర్యాప్తు జరపాలి. ఇది ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య జరిగిన గొడవల వలనే బయటకు వచ్చింది. మీడియాలో వచ్చిన తర్వాతే నైని బ్లాక్ టెండర్లు రద్దు చేశారు. అంతకు ముందు టెండర్లు ఎందుకు రద్దు చేయలేదో భట్టి బయట పెట్టాలి' అని ఆయన అన్నారు.



**నైని బ్లాక్ వ్యవహారంలో పారదర్శకత లేదు :**

రామచంద్రరావు మాట్లాడుతూ.. 'నైని బ్లాక్ వ్యవహారంలో పారదర్శకత లేదు. సింగరేణి అవినీతిలో బీఆర్ఎస్ పాత్ర ఉంది. రాష్ట్రమంతా నైని కోల్ బ్లాక్ గురించి మాట్లాడుతున్నారు. సింగరేణిలో ఎప్పుడూ కూడా రాష్ట్ర ప్రభుత్వం వాటా అధికంగా ఉంటుంది. ప్రస్తుతం సింగరేణి లాభాల్లో ఉంది. నైని కోల్ బ్లాక్ అంశంతో సీఎం, డిప్యూటీ సీఎం మధ్య వివాదాలు బయటపడ్డాయి. మంత్రులు బంధువులకు కోల్ బ్లాక్ కేటాయించే ప్రయత్నం చేశారు. కిషన్ రెడ్డికి లేఖ రాసే నైతిక హక్కు బీఆర్ఎస్?కి లేదు. బీఆర్ఎస్ సుద్ద పూసేమీ కాదు. నైని బ్లాక్‌లో ఎవరికి ఎంత ముట్టిందో చెప్పాలి. సింగరేణిలో కమిషన్ కింద కోట్లు సంపాదిస్తున్నారు' అని రామచంద్రరావు తెలిపారు.

**మంత్రుల మధ్య తగాదాలు..**

'కాంగ్రెస్ మంత్రుల మధ్య తగాదాలు అవుతున్నాయి. వారి వారి బంధువులకు కాంట్రాక్టులకు ఇవ్వడానికి పోటీ పడుతున్నారు. మరోవైపు బీఆర్ఎస్‌లో ఆస్తుల పంచాయతీ నడుస్తోంది. హరీష్ రావుకు ఒకటే చెప్తున్నా.. సుద్దపూస మాటలు మాట్లాడొద్దు. రాష్టానికి మొదట భ్రష్టు పట్టించింది బీఆర్ఎస్.. దాన్ని కాంగ్రెస్ కొనసాగిస్తోంది. సింగరేణి ఉద్యోగులకు, ప్రజలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి. స్టేట్ గవర్నమెంట్‌లో సిట్, ఇతర దర్యాప్తు సంస్థలు కూడా ఉన్నాయి. వాటితో కూడా విచారణ జరిపించాలి. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల అవినీతి, ప్రస్తుత రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై కూడా అవినీతి విచారణ జరగాలి' అని ఆయన డిమాండ్ చేశారు. 'కాళేశ్వరం మొత్తం రూ .లక్ష 30 వేల కోట్లు ఖర్చు చేశారు. కాళేశ్వరం ఏటిఎంగా మారిందని మేము కూడా చెప్పాం. ఫోన్ ట్యాపింగ్ కేసు రెండేళ్లుగా విచారణ జరుగుతోంది. ఈ కేసులో చాలా మంది అధికారులను అరెస్ట్ చేసినా.. రాజకీయ నాయకులను మాత్రం అరెస్ట్ చేయలేదు. ఇంకా ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ మాత్రమే చేస్తున్నారు. హరీష్ రావును సిట్ ఎందుకు పిలవలేదు. వారి ప్రభుత్వంలోనే ఫోన్ ట్యాపింగ్ చేశారు. సీబీఐని రాష్ట్రంలోకి రానివ్వమని బీఆర్ఎస్ గతంలో జీవో తెచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా ఆ జీవోను ఇంకా ఎత్తివేయలేదు. ఈడీకి ఎలాంటి అనుమతి అవసరం లేదు.. వాళ్ళు విచారణ చేయొచ్చు' అని రామచంద్రరావు పేర్కొన్నారు.

# చలాన్లపై ట్రాఫిక్ పోలీసులకు తెలంగాణ హైకోర్టు ఆదేశాలు




**ఇంటర్నెట్ డెస్క్:** వాహన చలాన్లపై ట్రాఫిక్ పోలీసులకు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్ చలాన్ల కోసం వాహనదారులను బలవంతం చేయవద్దని తేల్చి చెప్పింది. వాహనాల తాళాలు లాక్కోవడం, సీజ్ చేయడం సరికాదంది. స్వచ్ఛందంగా చెల్లిస్తేనే చలాన్లు వసూలు చేయాలని, లేకపోతే నోటీసులు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. కాగా.. గత సంవత్సరం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి రూ.239.37 కోట్ల చలాన్లు విధించారు. ఇందులో వాహనాలను ఆపి ట్రాఫిక్ పోలీసులు విధించిన చలాన్లు 10,27,335 ఉండగా, ఈ-చలాన్లు 25,93,152 ఉన్నాయి. ఈ రెండు రకాల చలాన్ల మొత్తం విలువ రూ. 239.37 కోట్లు అని వార్షిక నివేదిక ద్వారా వెల్లడైంది. కొద్దిరోజుల క్రితం యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా అరైవ్-అలైవ్ పేరుతో ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులకు పోలీసులు చలానాలు వేయగానే.. వారి బ్యాంకు ఖాతా నుంచి ఆ మొత్తం ఆటోమెటిక్‌గా చెల్లింపు జరిగిపోయేలా సరికొత్త వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు.

## రికార్డ్‌స్థాయి ఆదాయం.. చరిత్ర సృష్టించిన ఏపీఎస్ఆర్టీసీ




**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఏపీఎస్ఆర్టీసీ) ఆదాయంలో రికార్డ్ సృష్టించింది. జనవరి 19న ఒక్క రోజులోనే రూ.27.68 కోట్ల ఆదాయం సాధించింది. ఆర్టీసీ చరిత్రలోనే అత్యధిక రోజువారీ ఆదాయ రికార్డ్‌ను నెలకొల్పింది. జనవరి 19న ఆర్టీసీ బస్సుల్లో అత్యధికంగా 50.6 లక్షల మంది ప్రయాణించారు. సంక్రాంతి సెలవులు ముగియడంతో ప్రజలంతా సొంతూళ్ల నుంచి తిరుగు పయనమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేకంగా అదనపు బస్సులను ఏర్పాటు చేసింది ఆర్టీసీ. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా వందలాది ప్రత్యేక బస్సులు నడిపి, ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చింది. ఈ అసాధారణ విజయానికి కారణమైన డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది, సూపర్వైజర్లు, అధికారులందరినీ ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఀ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమల రావు ప్రత్యేకంగా అభినందించారు. కాగా.. సంక్రాంతి తిరుగు ప్రయాణంలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలను ముందుగానే అంచనా వేసిన ఆర్టీసీ అధికారులు.. ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. బస్సు షెడ్యూల్స్‌ను పెంచడం, అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయడం, ఆన్‌లైన్ బుకింగ్‌లను సులభతరం చేయడం వంటి చర్యలతో ప్రయాణికులు సురక్షితంగా, సౌకర్యవంతంగా తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు.

## కల్తీ మద్యం కేసులో జోగి సోదరులకు బెయిల్




**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఏపీ కల్తీ మద్యం తయారీ కేసులో మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రాముకు విజయవాడ కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. 6వ ఏజెఎంఎఫ్‌సి కోర్టు భవానీపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో వీరిద్దరికి బెయిల్ మంజూరు చేసింది.

**కేసు వివరాలిలా..**

జోగి రమేశ్, జోగి రాము.. భవానీపురంలో నకిలీ మద్యం తయారీ కేసులో నిందితులుగా ఉన్నారు. వీరిద్దరూ విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. ఈ కేసులో ఏ18గా జోగి రమేశ్, ఏ19గా జోగి రాము పేర్లు ఉన్నాయి. అయితే.. ములకలచెరువు కేసులో ఇంకా జోగి రమేశ్‌కు బెయిల్ రాలేదు. దీంతో జైల్లోనే జోగి సోదరులు ఇంకా జైల్లోనే ఉండనున్నారు.

**ఆస్పత్రిలో చికిత్స..**

అంతకుముందు.. జోగి రమేశ్‌ను విజయవాడ జిల్లా జైలు నుంచి చెయ్యి నొప్పి కారణంగా ఆస్పత్రికి తరలించాల్సి వచ్చింది. వైద్య పరీక్షల అనంతరం ఆయన్ను తిరిగి విజయవాడ జైలుకు తరలించారు. నకిలీ మద్యం తయారీకి సంబంధించి జోగి రమేశ్‌పై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో జోగి సోదరులను నిందితులుగా పోలీసులు చేర్చారు. ప్రాథమిక విచారణలో భాగంగా ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు జోగి సోదరులను విచారించారు. ఈ విచారణలో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ విచారణ ఆధారంగా పోలీసులు.. దర్యాప్తు ముమ్మరం చేశారు.

## తదుపరి దర్యాప్తు అవసరముందా?: వివేకా హత్య కేసులో సీబీఐని ప్రశ్నించిన సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ :** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఎవరిని కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించాలని అనుకుంటున్నారో చెబితే ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకుంటామని సీబీఐకి సుప్రీం కోర్టు తెలిపింది. ఇదే అంశంపై విచారణను ఫిబ్రవరి 5కు వాయిదా వేసింది న్యాయస్థానం. వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తుపై ట్రయల్ కోర్టు తీర్పును వివేకా కుమార్తె సునీతా రెడ్డి సుప్రీంలో సవాల్ చేశారు. సునీత పిటీషన్‌పై జస్టిస్ ఎంఎం. సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారించింది. ముందుగా.. సునీత తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ట్రయల్ కోర్టుకు వెళ్లామని.. అక్కడ తదుపరి దర్యాప్తు అవసరమని పిటిషన్‌లో తాము పేర్కొన్న అంశాల్లో ఏ ఒక్కటీ ట్రయల్ కోర్టు పరిగణలోకి తీసుకోలేదన్నారు. అంతేకాకుండా పిటిషన్‌లో పేర్కొనని అంశాలను పరిగణలోకి తీసుకుని పరిమితమైన మేరకే పాక్షికంగా దర్యాప్తునకు అనుమతి ఇచ్చారని.. అది న్యాయబద్ధం కాదని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. వివేకా కేసును పాక్షికంగా దర్యాప్తునకు అనుమతించడమేంటి.. అని లూథ్రా ధర్మాసనం ముందుకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా.. జస్టిస్ ఎంఎం.సుందరేశ్ జోక్యం చేసుకుని.. వివేకా హత్య కేసులో తదుపరి విచారణ అవసరమని భావిస్తున్నారా? అని సీబీఐని ప్రశ్నించింది.

ఏయే అంశాలపై తదుపరి విచారణ అవసరమో స్పష్టంగా చెప్పాలని సీబీఐని కోరింది. ఎవరిని కస్టడీలోకి తీసుకొని విచారించాలని అనుకుంటున్నారో కూడా చెబితే దాన్ని పరిగణలోకి తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది.

# సమ్మర్ నుంచి మెగాస్టార్ బరిలోకి!



మొత్తానికి మెగాస్టార్ చిరంజీవి ఖాతాలో 'మనశంకర వరప్రసాద్ గారు'తో మరో బ్లాక్ బస్టర్ జమ అయింది. సంక్రాంతి కానుకగా రిలీజ్ అయిన సినిమా సక్సెస్ ఫుల్ గా దూసుకుపోతుంది. ఇప్పటికే సినిమా 200 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. చాలాచోట్ల సినిమా బ్రేక్ ఈవెన్ అయిపోయింది. దీంతో నిర్మాతలు సహా అంతా సంతోషంగా కనిపిస్తున్నారు. గ్రాండ్‌గా సక్సెస్ ఈవెంట్ కూడా ప్లాన్ చేస్తున్నారు. ఈ వేసవిలో చిరంజీవి నటించిన మరో చిత్రం 'విశ్వంభర' కూడా రిలీజ్ అయిపోతుంది. ఇప్పటికే రిలీజ్ అవ్వాల్సిన సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం కారణంగా వాయిదా పడింది. కానీ సమ్మర్‌లో ఎట్టి పరిస్థితుల్లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. మరి చిరంజీవి-శ్రీకాంత్ ఓదెల ప్రాజెక్ట్ సంగతేంటి? అంటే అందుకు సమయం ఆసన్నమవుతుంది. మార్చి లేదా ఏప్రిల్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు పెట్టాలని శ్రీకాంత్ ప్లాన్ చేస్తున్నాడు. ప్రస్తుతం శ్రీకాంత్ ఓదెల నాని హీరోగా 'ది ప్యారడైజ్' తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ 70 శాతానికి పైగా పూర్తయింది. పెండింగ్ షూటింగ్ మరో రెండు నెలల్లో పూర్తి కానుందని సమాచారం. ఈ నేపథ్యంలోనే శ్రీకాంత్ సినిమాను లైన్‌లో పెడుతున్నాడు. ది ప్యారడైజ్‌కు ముందే చిరంజీవి సినిమా ప్రకటన వచ్చింది. కానీ తాత్కాలికంగా చిరు ప్రాజెక్ట్‌ను పక్కనబెట్టి నానితో ముందుకెళ్లారు. చిరంజీవికి కూడా వేర్వేరు కమిట్‌మెంట్లు ఉండటంతో శ్రీకాంత్‌ని హోల్డ్‌లో పెట్టారు. 'ది ప్యారడైజ్' ముగింపు దశకు చేరుకోవడం, చిరంజీవి నటించిన 'మన శంకరవర ప్రసాద్ గారు' రిలీజ్ అవ్వ డం..'విశ్వంభర' షూటింగ్ పూర్తవ్వడంతో తదుపరి పూర్తి చేయాల్సింది శ్రీకాంత్ ప్రాజెక్ట్ కావడంతో సంసిద్ధమవుతున్నారు. 'విశ్వంభర'కు సంబంధించి చిరంజీవి డబ్బింగ్ పనులు పూర్తి చేయాలి. అలాగే ఆ సినిమా రిలీజ్ సమయంలో ప్రచారంలో జాయిన్ అవ్వాలి. ఆ రెండు పనులు కూడా పూర్తి చేస్తే చిరు పూర్తిగా ఆ ప్రాజెక్ట్ నుంచి రిలీవ్ అయినట్లే. నానితో శ్రీకాంత్ తెరకెక్కించేది కూడా భారీ యాక్షన్ థ్రిల్లరే.

'రాక్షసుడు' తరహా కాన్సెప్ట్ అని ఇప్పటికే ప్రచారంలో ఉంది. ఈ సినిమాకు సంబంధించి చిరంజీవి గత చిత్రాల కంటే ఎక్కువ కష్ట పడాలి. చిరంజీవి లుక్ పరంగా మార్పు తీసుకొచ్చింది కూడా ఈ సినిమా కోసమేనని ఇప్పటికే ప్రచారంలో ఉంది. మెగాస్టార్ సెకెండ్ ఇన్నింగ్స్‌లోనే ప్రత్యేకమైన చిత్రంగా శ్రీకాంత్ ప్రాజెక్ట్ నిలుస్తుందనే టాక్ ఫిలిం సర్కిల్స్‌లో నడుస్తోంది.

# మారుతి తదుపరి అడుగు ఎటు? గాసిప్స్ మధ్య అసలైన క్లారిటీ!




టాలీవుడ్‌లో ఒక సినిమా పూర్తి కాగానే, ఆ దర్శకుడి తదుపరి ప్రయాణం ఎటు అనే చర్చ సహజంగానే మొదలవుతుంది. మారుతిలాంటి కమర్షియల్ డైరెక్టర్ విషయంలో ఈ ఆసక్తి మరింత ఎక్కువగా ఉంటుంది. ఆయన మేకింగ్ స్టైల్ వల్ల, ఇండస్ట్రీలో ఓ వర్గం హీరోలు ఒక వినోదాత్మక చిత్రం చేస్తే బాగుంటుందని ఆశపడుతుంటారు. ఈ క్రమంలోనే సోషల్ మీడియాలో రకరకాల పేర్లు వినిపిస్తూ ఉంటాయి. సాధారణంగా ఒక క్రేజీ కాంబినేషన్ గురించి వార్త రాగానే అది ఇంటర్నెట్‌లో వైరల్ అవ్వడం కామన్. ప్రభాస్ వంటి గ్లోబల్ స్టార్‌తో తీసిన 'ది రాజాసాబ్' ఫలితం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో, మారుతి తన నెక్స్ట్ ప్రాజెక్ట్ ఎవరితో చేస్తారనే క్యూరియాసిటీ అందరిలోనూ పెరిగింది. అయితే, ఒక దర్శకుడి గురించి వచ్చే ప్రతి వార్త నిజం కావాలని లేదు. కొన్నిసార్లు ప్రాథమిక చర్చలు జరిగినంత మాత్రాన అది సినిమాగా మారుతుందని చెప్పలేం. అసలు విషయానికి వస్తే, దర్శకుడు మారుతి మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కాంబినేషన్లో ఒక సినిమా ఉండబోతోందని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. గీత ఆర్ట్స్ 2 ఈ చిత్రాన్ని నిర్మిస్తోందని కూడా వార్తలు వచ్చాయి. కానీ, తాజా సమాచారం ప్రకారం ఈ వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని తెలుస్తోంది. సినిమా రంగంలో ప్రాథమిక చర్చలు జరిగినంత మాత్రాన అది ప్రాజెక్టుగా మారుతుందని చెప్పలేం. మారుతి తదుపరి చిత్రం గురించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదని సమాచారం. ఈ విషయంలో వస్తున్న పుకార్లను నమ్మవద్దని, ఏదైనా కొత్త అప్‌డేట్ ఉంటే అది నేరుగా అధికారికంగా వెల్లడిస్తారని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. మారుతి తన పనితీరుతో నిర్మాతలకు ఎప్పుడూ ఒక కంఫర్ట్ జోన్‌ను కల్పిస్తారు. 'ది రాజాసాబ్' బాక్సాఫీస్ వద్ద ఆశించిన వసూళ్లు రాబట్టకపోయినా, ఆయన మీద నిర్మాతలకు ఉన్న నమ్మకం తగ్గలేదు. ఆయన తన తదుపరి స్క్రిప్ట్ విషయంలో ఇప్పుడు ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఒక దర్శకుడి నుండి అధికారిక ప్రకటన రాకుండా ఏ విషయాన్ని కన్ఫర్మ్ చేయడం సరైనది కాదు. అనవసరమైన హైప్ క్రియేట్ చేయడం వల్ల చివరికి అది ప్రాజెక్ట్ మీద ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. చివరగా, మారుతి తదుపరి సినిమా ఎవరితో ఉండబోతోందనే సస్పెన్స్ ఇంకా కొనసాగుతూనే ఉంది. వరుణ్ తేజ్ లేదా మరే ఇతర హీరో అయినా సరే, అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే. ప్రస్తుతం మారుతి కొంత బ్రేక్ తీసుకునే ఆలోచనలో ఉన్నాడు. ఎందుకంటే రాజాసాబ్ కోసం లాస్ట్ మూమెంట్‌లో ఆయన ఎక్కువ సమయం స్టూడియోల చుట్టూ తిరగాల్సి వచ్చింది. పోస్ట్ ప్రొడక్షన్ విషయం నిద్రలేని రాత్రులు గడిపారు. కాబట్టి కొంత బ్రేక్ తీసుకుని ఆ తరువాత న్యూ ప్రాజెక్టు విషయంలో అఫీషియల్‌గా క్లారిటీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

# 'ఫౌజీ' తర్వాత బాలీవుడ్‌కి వెళ్తున్నాడా?




'సీతారామం' సక్సెస్ హను రాఘవపూడి కెరీర్‌నే మార్చేసింది. అప్పటి వరకూ రీజనల్ మార్కెట్‌లో నాలుగైదు సినిమాలు చేసిన హను రాఘవపూడి 'సీతారామం' విజయంతో పాన్ ఇండియాలో ఫేమస్ అయ్యాడు. కొన్ని వాస్తవ సంఘటనలు స్ఫూర్తిగా తీసుకుని తెరకెక్కించిన సినిమాకు పాన్ ఇండియాలో మంచి ఫలితాలు సాధించింది. 30 కోట్ల బడ్జెట్‌లో నిర్మించి 100 కోట్ల వసూళ్లను సాధించాడు. అప్పటికే హను రాఘవపూడి వరుస ఫ్లాప్‌ల్లో ఉన్నాడు. అవకాశాలు కూడా కష్టం అనుకున్న సమయంలో 'సీతారామం' కథతో దుల్కర్ సల్మాన్‌ని ఒప్పించాడు. అతడి కథను నిర్మాతలు స్వప్నా దత్, ప్రియాంక దత్ బలంగా నమ్మడంతోనే అంత గొప్ప విజయం సాధ్యమైంది. అతడిలో ప్రతిభను గుర్తించే డార్లింగ్ ప్రభాస్ మరో ఆలోచన లేకుండా ఛాన్స్ ఇచ్చాడు. ప్రస్తుతం ఇద్దరి కాంబినేషన్‌లో 'ఫౌజీ' భారీ ప్రాజెక్ట్ గా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. లవ్ అండ్ వార్ నేపథ్యంలో తెరకెక్కుతోన్న చిత్రమిది. స్వాతంత్ర్యానికి ముందు జరిగిన కథను తెరకెక్కిస్తున్నాడు. భారీ వార్ సన్నివేశాలతో పాటు, అదే కథలో అద్భుతమైన ప్రేమకథను హైలైట్ చేస్తున్నాడు. అన్ని పనులు పూర్తి చేసుకుని ఇదే ఏడాది ఆగస్టులో చిత్రం ప్రేక్షకుల ముందకు రానుంది. ఈ సినిమా తర్వాత హను రాఘవపూడి ఏ హీరోతో సినిమా చేస్తాడు? అనే చర్చ అప్పుడే మొదలైంది. 'ఫౌజీ' గ్యారెంట్ హిట్ అనే టాక్ నేపథ్యంలో హను తదుపరి హీరో ఎవరు? అంటూ సర్వత్రా చర్చకొస్తుంది. ఈ నేపథ్యంలో ఓ ఇంట్రెస్టింగ్ విషయం లీకైంది. 'ఫౌజీ' అనంతరం హను రాఘవపూడి బాలీవుడ్‌తో హీరోతో సినిమా చేయనున్నాడని తెలిసింది. షాహిద్ కపూర్‌కు ఓ స్టోరీ వినిపించాడుట. నచ్చడంతో అతడు కూడా ఒకే చెప్పినట్లు వినిపిస్తోంది. తెలుగు-హిందీ నిర్మాణ భాగస్వామ్యంలోఈ చిత్రాన్ని నిర్మించే దిశగా చర్యలు తీసుకుంటున్నారుట. అదే నిజమైతే తెలుగు, హిందీ లోనే సినిమా చేసే అవకాశాలున్నాయి. కొంత కాలంగా బాలీవుడ్ హీరోలు తెలుగు సినిమాలు చేయడానికి ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న సంగతి తెలిసిందే. టాలీవుడ్ నుంచి పాన్ ఇండియా సినిమా రిలీజ్ అయిందంటే సక్సెస్ రేట్ బాగుంటుంది. ఇక్కడ మేకర్స్ ఉత్తమంగా పనిచేస్తున్నారు అనే పాజిటివ్ ఇంప్రెషన్ బాలీవుడ్ హీరోల్లో బలంగా ఉంది. అమీర్ ఖాన్, సల్మాన్‌ఖాన్‌లాంటి స్టార్లే తెలుగు దర్శకుల కోసం ఎదురు చూస్తున్నారు. అలాంటి అవకాశం వాళ్లకు రాకపోయినా షాహిద్ కపూర్‌కి హను రాఘవపూడి రూపంలో వస్తోంది. టాలీవుడ్ మేకర్స్‌తో పని చేయడం షాహిద్‌కి కొత్తేం కాదు. ఇప్పటికే సందీప్ రెడ్డి వంగతో 'అర్జున్ రెడ్డి' రీమేక్‌లో నటించాడు. అంతకుముందు 'జెర్సీ' రీమేక్ కోసం గౌతమ్ తిన్ననూ రితోనూ పని చేసిన వారే. ఈ రెండు సినిమాలతో తెలుగు వారు ఎంతటి ప్రతిభావంతులు అన్నది షాహిద్‌కి ఐడియా ఉంది.

# మినీ డ్రెస్‌లో బుట్టబొమ్మ అందాలు!



2010లో మిస్ యూనివర్స్ ఇండియా అందాల పోటీలలో పాల్గొన్న పూజా హెగ్డే.. 2012లో వచ్చిన 'ముగమూడి' అనే తమిళ చిత్రం ద్వారా నటన రంగ ప్రవేశం చేసింది. అటు తెలుగులో 2014లో నాగచైతన్య హీరోగా నటించిన 'ఒక లైలా కోసం' అనే సినిమాలో నటించి తన పాత్రకు విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అదే ఏడాది ప్రిన్స్ హీరో వరుణ్ తేజ్‌తో కలిసి 'ముకుందా' అనే సినిమాలో నటించి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది ఈ ముద్దుగుమ్మ. తెలుగులో వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న సమయంలోనే హిందీలో 2016లో హృతిక్ రోషన్ సరసన మోహెంజోదారో సినిమా ద్వారా హిందీ రంగ ప్రవేశం చేసింది. ఇకపోతే ప్రస్తుతం ఈమె ప్రముఖ కోలీవుడ్ స్టార్ హీరో, రాజకీయ నాయకుడు విజయ్ దళపతి ఆఖరి చిత్రం 'జననాయగన్' చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా ఈ ఏడాది జనవరి 9వ తేదీన విడుదల కావాల్సి ఉండగా.. సెన్సార్ జాప్యం వల్ల విడుదల ఆలస్యం అవుతుంది. ఇంకా ఈ సినిమా విడుదల తేదీపై క్లారిటీ వెలువడలేదు. మరొకవైపు ఈమెకు సంబంధించిన ఒక విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. పూజ హెగ్డే మాట్లాడుతూ.. నేను ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఒక స్టార్ హీరో నా క్యారవాన్‌లోకి వచ్చి నాపై చేయి వేశాడు. ఆ సమయంలో ఏం చేయాలో తెలియలేదు. అలా అని సైలెంట్‌గా ఉండిపోలేదు. ఆ స్టార్ హీరో చెంప చెల్లుమనిపించాను. ఇక అదే సినిమాలో ఆ స్టార్ హీరోతో నాకు కొన్ని సన్నివేశాలు ఉన్నా.. డూపు పెట్టి సన్నివేశాలు కంప్లీట్ చేశాము. ఇక ఆ తర్వాత నుంచి అతడితో కలిసి నేను స్క్రీన్ షేర్ చేసుకోలేదు" అంటూ పూజా హెగ్డే తెలిపింది. అయితే ఇది ఆమె స్వయంగా తెలిపిందా లేక ఎవరైనా ఆమె ఐడిపై ఇలా కామెంట్లు చేశారా అన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. మరొకవైపు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పూజా హెగ్డే షేర్ చేసిన ఫోటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. మినీ డ్రెస్ ధరించి మెట్లపై స్టైలిష్ లుక్‌లో ఫోటోలకు ఫోజులిచ్చింది. స్టన్నింగ్ లుక్‌లో పూజా హెగ్డే షేర్ చేసిన ఈ ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. బుట్టబొమ్మ ఎప్పుడూ తన అందంతో అభిమానులను ఆకట్టుకుంటుంది అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఇకపోతే ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె తన ఫిట్నెస్ గురించి తాను తీసుకునే ఫుడ్ డైట్ గురించి చెప్పుకొచ్చింది. నేను ప్రతిరోజు పండ్లు తీసుకుంటాను. అలాగే రోటీ , సబ్జీ, చేపలు అంటే చాలా ఇష్టం. ముఖ్యంగా ఇంట్లో తయారు చేసింది ఏదైనా సరే నేను ఇష్టంగా తింటాను. ముఖ్యంగా నాకు పిజ్జా అంటే ఇష్టం. కానీ కాఫీ, సలాడ్ వంటివి ఇష్టం ఉండదు అంటూ పూజా హెగ్డే తెలిపింది.

# ఎత్తిపోతల పథకం నిర్వహణ కమిటీ రద్దు

## - త్రీ మ్యాన్ కమిటీకి నిర్వహణ బాధ్యతలు

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మండలం జి.మేడపాడు శ్రీ తోట గోపాలకృష్ణ మ్యూచుపల్లి ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ (జి.మేడపాడు ఎత్తిపోతల పథకం) పాలక వర్గమును జిల్లా కలెక్టర్ రద్దు చేస్తూ ఆదేశాలు ఇచ్చి నట్లు ఏపీ ఎస్ఐడిసి రాజమహేంద్రవరం ఎగ్జిక్యూ టివ్ ఇంజనీర్ పి దుర్గా గురవయ్య ప్రకటించారు. సోమవారం మండలంలోని పెద్ద బ్రహ్మదేవం గ్రామంలోని జి మేడపాడు ఎత్తిపోతల పథకం వద్ద రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏ పీ ఎస్ ఐ డి సి ఈఈ దుర్గా గురవయ్య మాట్లాడుతూ పథకం పరిధిలో నూటికి నలభై నుండి 50 శాతం రైతులకు మాత్రమే సాగునీరు అందడంతో పాటు, పథకంతో సంబంధం లేని సుమారు 400 ఎకరాల భూములకు అనధికారికంగా సాగు నీరు సరఫరా చేయడం, గడచిన 15 ఏళ్లుగా మోటార్ల సైతం రిపేర్లు చేయిం చకపోవడం, పథకంకు చెందిన నిధులు సుమారు 27,07,800 ప్రస్తుత సొసైటీ పాలక వర్గం అధ్యక్షుడు ఆధ్వర్యంలో నిధులు దుర్వినియోగమైనట్లు విచారణ జరపాలని తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు పాలకుర్తి శ్రీనుబాబు చేసిన ఫిర్యాదు, తదితర ఆరోపణలపై ఏపీ ఎస్ ఐ డి సి డి ఈ ఈ రాజమహేంద్రవరం దర్యాప్తు నివేదిక తేదీ 3.4.2025, సామర్లకోట మండల తాసిల్దార్ 26 11 2025వ తేదీ నిర్వహించిన దర్యాప్తు నివేదికలో పేర్కొనడంతో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, 2025 డిసెంబర్ 30వ తేదీన ప్రస్తుత పాలకవర్గాన్ని రద్దు చేస్తూ త్రీ మెన్ కమిటీతో నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చినట్లు ఈ ఈ వివరించారు. త్రీ మెన్ కమిటీలో ఏపీ ఎస్ఐడిసి ఏఈ ఏ





సురేంద్ర, ఇంజనీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్ తోపాటు మండల వ్యవసాయ అధికారి పర్యవేక్షణలో ఇకమీ దట ఎత్తిపోతల పథకం సేవలు అందిస్తుందన్నారు. ఎత్తిపోతల పథకం నిర్వహణకు జీ మేడపాడు జి కొత్తూరు చిన్న బ్రహ్మదేవము గ్రామాలకు చెందిన రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఈ ఈ రైతులకు విజ్ఞప్తి చేశారు. త్రీ మెన్ కమిటీని రైతులకు పరిచయం చేశారు. సభలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాసాచార్యులు చౌదరి (శ్రీనుబాబు) వివరిం చారు. కొత్త మోటార్ల ఏర్పాటుకు, పైపులైన్ల రిపేర్లకు అవసరమైన నిధులు అవసరమైన నిధులు ప్రభుత్వం సత్వరమే మంజూరు చేసేలా చూడాలని ఈ ఈ విజ్ఞప్తి చేశారు.

**రైతుల ఆవేదన:**

ఎత్తిపోతల పథకం అమలులోకి వచ్చి 15 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ తమ పొలాలకు పూర్తిస్థాయిలో సాగునీరు ఇవ్వడం లేదని జి కొత్తూరుకు చెందిన రైతు నాయకులు గోలి తమ్మిరాజు ధ్వజమెత్తారు. నెలకు ఒకసారి కూడా తమకు వంతు ఇవ్వడం లేదని, మెయిన్ లైన్ పేరుతో పథకం పరిధిలో లేని పొలాలకు నీరు ఇచ్చి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపణలు చేశారు.

తమకు పూర్తి స్థాయిలో పొలాలకు నీరు ఇచ్చే వరకు నీటి తీరువా సొమ్ము చెల్లించేది లేదని అదే గ్రామానికి చెందిన మరో రైతు ఆవేశంగా చెప్పారు. నీటి పంపిణీలో జరుగుతున్న అవకతవకలపై సిబ్బందిపై చర్యలు తీసుకుని రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా చూడాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఏపీ ఎస్సై డి సి ఏ ఈ ఏ సురేంద్ర పిఎ వి వరప్రసాద్ మండల వ్యవసాయ అధికారి వి మురలీధర్ అగ్రికల్చర్ అసిస్టెంట్ బి దినేష్ కుమార్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఏ ప్రసన్న కుమార్, జి మేడపాడు సొసైటీ అధ్యక్షులు పాలకుర్తి రవిబాబు, మండల టిడిపి ఉపాధ్యక్షులు తోటకూర శ్రీనివాసు, ఎత్తిపోతల పథకం నిర్వహణ సిబ్బంది, మూడు గ్రామాలకు చెందిన రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**లిఫ్ట్ ఇరిగేషన్ సొసైటీ రద్దు:**

అలాగే జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు సామర్ల కోట మండలం పెద బ్రహ్మదేవం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పాలకవర్గమును రద్దు చేసి త్రీ మెన్ కమిటీకి అప్పగించే ప్రక్రియను సోమవారం సాయంత్రం ఏపీ ఎస్ఐడిసి రాజమహేంద్రవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి దుర్గా గురవయ్య చేపట్టారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం 11 వద్ద సమావేశం నిర్వహించారు. ఈ పథకంలో 800 మంది రైతులు ఉండగా కేవలం 57 మందికి ఓటు హక్కు కల్పిం చారని ఏడు శాతం మంది రైతులే ఓటర్లుగా నీటికి కొన సాగుతున్నారని, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించడం లేదని, లక్షలాది రూపాయల సొమ్ము దుర్వినియోగం అయిందని గ్రామానికి చెందిన కమ్మిల వెంకటేశ్వరరావు తదితరులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారుల చేపట్టిన విచారణ నివేదికను పరిగణలోకి తీసుకుని జిల్లా కలెక్టర్ పాలకవర్గాన్ని రద్దు చేస్తూ ఆదేశాలు ఇచ్చారని ఏపీ ఎస్సై డి సి ఈ ఈ దుర్గా గురవయ్య ప్రకటించారు. అయితే ప్రస్తుత పాలకవర్గం గానీ పథకం నిర్వహణ చేసే సిబ్బంది గానీ అందుబాటులో లేరు. ఈ సమా వేశంలో మండల టిడిపి గౌరవ అధ్యక్షులు తోట కూర శ్రీనివాస్, కాకినాడ జిల్లా తెలుగు రైతు కమిటీ అధ్యక్షులు పాలకుర్తి శ్రీనుబాబు, మండల వ్యవసాయ అధికారి వి మురళీధర్, ఫిర్యాదుదారులు తదితరులు పాల్గొన్నారు.

# 6 జిల్లాలో ఎత్తిపోతల పథకాలకు రూ.70 కోట్ల విద్యుత్ బకాయిలు




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకి నాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలలో 90 ఎత్తిపోతల పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ. 70 కోట్ల రూపాయలు విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉందని ఏపీ ఎస్ ఐ డి సి ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి దుర్గా గురవయ్య చెప్పారు. సామర్లకోట మండలం జి మేడపాడు ఎత్తిపోతల పథకం వద్ద సోమవారం తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆరు జిల్లాల్లో సుమారు 80 వరకు ఎత్తిపోతల పథకాల ద్వారా రైతులకు సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. అయితే ఈ పథకాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బకాయిలు 70 కోట్లు ఇప్పటి వరకు చెల్లించాల్సి ఉందన్నారు. జి మేడపాడు తోట గోపాలకృష్ణ మ్యూచువల్లి ఎయిడెడ్ ఎత్తిపోతల పథకం పూర్తిస్థాయి మరమ్మతులకు 96 లక్షల వ్యయంతో ప్రతిపాదనలు పంపడం జరిగిందని, ప్రభుత్వం నుండి అనుమతులు మంజూరు కాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని ఈ ఈ చెప్పారు. వివాదాలకు తావు లేకుండా ఎత్తిపోతల పథకాల నిర్వహణకు రైతులు సంఘటితంగా వినియోగించుకోవాలని సూచించారు.

# ముద్రగడను కలిసిన వైసీపీ నాయకులు రమణారావు



**అమలాపురం, (రాజధాని వార్తలు):** డా.బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు ఆధ్వర్యంలో పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు సోమవారం ముద్రగడ పద్మనాభం, ముద్రగడ గిరిబాబును మర్యాదపూర్వకంగా పూర్వకంగా అయన స్వగృహం వద్ద కలిసి ఘనంగా సన్మానించారు. పార్టీ నేతలంతా కలిసికట్టుగా పనిచేసి మళ్ళీ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని ఆయన సూచించారు. రమణారావు అధ్వర్యంలో వైసీపీ స్టేట్ ఎక్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ కుడుపూడి భరత్ భూషణ్, వేగిరాజు సాయిరాజు, తోట శ్రీను, బెజవాడ సత్తిబాబు, భీమనపల్లి గ్రామ సర్పంచ్ పెయ్యిల రాజ్ కుమార్, ఉప్పలగుప్తం మండల వైసీపీ ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్, ఈదరపల్లి మాజీ సర్పంచ్ నక్క సంపత్ కుమార్, అల్లవరం మండల యువజన నాయకులు దేవరపల్లి నరేష్, నేరేడుమెల్లి శ్రీనివాసరావు, ఎం వినోద్, పరమట రాజేష్, ముత్తాబత్తుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# అబూ సలేంకు పెరోల్ ఇవ్వొద్దు.. ముంబై కోర్టుకు తెలిపిన మహారాష్ట్ర ప్రభుత్వం





**ముంబై:** గ్యాంగ్‌స్టర్ అబూసలేంకు పెరోల్ ఇస్తే తీవ్రమైన పరిణామాలు ఎదురు కావొచ్చని మహారాష్ట్ర ప్రభుత్వం ముంబై హైకోర్టుకు తెలిపింది. పెరోల్ ఇస్తే అతను దేశం విడిచి పారిపోవచ్చని, దీనివల్ల ఇండియా, పోర్చుగల్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతినే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ మేరకు హైకోర్టులో ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. తన పెద్ద సోదరుడు మృతి చెందినందున తనకు 14 రోజులు పెరోల్ ఇవ్వాలని ముంబై హైకోర్టులో అబూ సలేం పిటిషన్ వేశాడు. దీనిని మహారాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తూ, మరీ అవసరం అయితే ఎమర్జెన్సీ పెరోల్ కింద రెండు రోజులకే పెరోల్‌ను పరిమితం చేయాలని సూచించింది. న్యాయమూర్తులు ఏఎస్ గడ్కరి, శ్యామ్ చాందక్‌లతో కూడిన హైకోర్టు డివిజన్ బెంచ్ ఈ పిటిషన్‌పై విచారణ జరపింది. సలేం కేసులో తాము ప్రాసిక్యూటింగ్ ఏజెన్సీ అని సీబీఐ పేర్కొంటూ తమను రెస్పాండెంట్‌గా చేర్చాలని కోరింది. సలేంకు బెయిల్ కానీ, పెరోల్ కానీ ఇస్తే శాంతి భద్రతల సమస్య తలెత్తవచ్చని కూడా సీబీఐ స్పష్టం చేసింది. దీంతో తదుపరి విచారణను ఈనెల 28వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది. సలేం అంతర్జాతీయ నేరస్థుడని, అనేక దశాబ్దాలుగా అతను నేర కార్యకలాపాలకు పాల్పడ్డాడని జైళ్ల శాఖ ఐజీ సుహాస్ వార్కే తమ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. భారత ప్రభుత్వం ఇచ్చిన నిర్దిష్ట హామీలకు అనుగుణంగానే పోర్చుగల్ నుంచి అతన్ని అప్పగించడం జరిగిందని గుర్తు చేశారు. అరెస్టు నుంచి తప్పించుకునేందుకే 1993లో సలేం భారత్ నుంచి పారిపోయాడని, ఇప్పుడు టెంపరరీగా అతన్ని విడుదల చేసినా మళ్లీ అదే పని చేసే అవకాశం ఉందని అన్నారు. సలేంను లిస్బాన్‌లో అరెస్టు చేసి 2005 నవంబర్‌లో భారత్‌కు పంపారు. నకిలీ పాస్‌పోర్ట్‌పై ప్రయాణించిన కేసులో అతన్ని దోషిగా పోర్చుగల్ గుర్తించింది. భారత అధికారుల అభ్యర్థన మేరకు పలు షరతులతో పోర్చుగల్ అతన్ని అప్పగించింది. 1993 ముంబై గొలుసుకట్టు బాంబు పేలుళ్ల కేసుతో సహా మూడు కేసుల్లో సలేంకు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. ప్రస్తుతం మహారాష్ట్రలోని తలోజా సెంట్రల్ జైలులో సలేం ఉన్నాడు.

# చట్టాలపై ప్రజలకు అవగాహన అవసరం

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ప్రజలంతా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది పలివెల చిన్న చంటి అన్నారు. పెద్దాపురం మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, ఏడో నెంబర్ చంద్రమౌళీశ్వరి ఆదేశాల మేరకు పెద్దాపురం పట్టణంలో ఉన్న 6, 7 సచివాలయాల్లో న్యాయ అవగాహన సద్రస్సు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాల్యవివాహాలు అరికట్టాలని, ఆడపిల్లలను కాపాడాలని, ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపేటప్పుడు లైసెన్స్ పొందాలని, హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు. అలాగే ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పలివల చిన్న చంటి, పారా



లీగల్ వాలంటీర్లు నూతలపాటి అప్పలకొండ, కుంచె నాని బాబు, కె.వి.వి లక్ష్మి, అంగన్వాడీ టీచర్లు, సచివాలయం సిబ్బంది, ఆశ వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డితో యూఏఈ మంత్రి భేటీ.. పలు కీలక అంశాలపై చర్చ



**ఇంటర్నెట్ డెస్క్:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో యూఏఈ మంత్రి దావోస్‌లో మంగళవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి తెలంగాణతో కలిసి పనిచేస్తామని యూఏఈ మంత్రి తెలిపారు. నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా భారత్ ఫ్యూచర్ సిటీ ఉందని సీఎం తెలిపారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే.. తెలంగాణ లక్ష్యమని వ్యాఖ్యానించారు. యూఏఈ తెలంగాణ సంయుక్త టాస్క్‌ఫోర్స్ ప్రతిపాదన చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**అలోన్ స్టోపెల్‌తో సీఎం భేటీ..**

దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల బృందం మొదటి రోజు బిజీబిజీగా ఉంది. ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ అథారిటీ చైర్మన్ అలోన్ స్టోపెల్‌తో సీఎం భేటీ అయ్యారు. సీఎంతో పాటూ మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. వ్యవసాయం, వాతావరణ మార్పులకు సంబంధించిన ఇన్నోవేషన్ స్టార్టప్‌లకు సహకారాలపై విస్తృతంగా చర్చించారు. ఆర్టిఫీసియల్ ఇంటెలిజెన్స్, డీప్‌టెక్ ఇన్నోవేషన్‌తో పాటు హెల్త్ టెక్, అగ్రిటెక్, సైబర్ సెక్యూరిటీ, ఎరో స్పేస్ వంటి సాంకేతిక రంగాల్లో తెలంగాణ స్టార్టప్‌లకు ఇజ్రాయెల్ మద్దతు ఇవ్వడంతో పాటు భాగస్వామ్యం పంచుకుంటుంది. ఆర్టిఫీసియల్ ఇంటెలిజెన్స్ సహా పలు రంగాల్లో ఇజ్రాయిలీ స్టార్టప్‌లతో కలిసి తెలంగాణ పైలట్ ప్రోగ్రామ్‌లను ప్రారంభించనుంది.

**తెలంగాణ రైజింగ్‌లో భాగస్వామ్యం కావాలి: మంత్రి శ్రీధర్ బాబు**

తెలంగాణ రైజింగ్‌లో భాగస్వామ్యం కావాలని గ్లోబల్ పారిశ్రామికవేత్తలకు తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం పలికారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా పదిశాతం లక్ష్యంగా విజన్ రోడ్‌మ్యాప్‌లో ఉందని తెలిపారు. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం 'ఇండియా పెవిలియన్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, సెమీకండక్టర్లు, ఏఐ, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో భారీ పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రోల్ మోడల్ రాష్ట్రంగా తెలంగాణ ఉందని చెప్పుకొచ్చారు. రెండేళ్లలో రూ.2.5 లక్షల కోట్ల పెట్టుబడులు సమీకరించినట్లు తెలిపారు. లైఫ్ సైన్సెస్ పాలసీ 2.0, తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్‌ను దావోస్ వేదికగా ఆవిష్కరిస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

# పి.జి.ఆర్.ఎస్., రెవెన్యూ క్లినిక్‌కు విశేష స్పందన

## - 177 వినతుల స్వీకరణ - రెవెన్యూకు సంబంధించిన 86 వినతులు - వినతులు పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించేది లేదు - రెవెన్యూ సమస్యలపై వినతులను సకాలంలో పరిష్కరించాలి : జిల్లా కలక్టరు ఎస్.రాంసుందర్ రెడ్డి

**విజయనగరం, (రాజధాని వార్తలు):** కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' పి.జి.ఆర్.ఎస్ మరియు 'రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలకు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుండి ప్రజలు తరలి వచ్చి తమ సమస్యలపై వినతి పత్రాలు, ఫిర్యాదులు అందజేసారు.

రెవెన్యూపై ఫోకస్: అందిన మొత్తం 177 వినతుల్లో అత్యధికంగా 86 రెవెన్యూ శాఖవే ఉన్నాయి. పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ వినతుల పరిష్కారంలో వేగం పెంచాలని, వినతులు పరిష్కారంలో ఆలసత్యం వహిస్తే సహించేది లేదని, రెవెన్యూ సమస్యలపై వినతులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాం సుందర్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా వచ్చిన వినతులు: రెవెన్యూ: 86, డిఆర్డిఎ-33, పంచాయతీ రాజ్: 13, మున్సిపల్-3 విద్యుత్ శాఖ-3, హౌసింగు-2, డిఎం అండ్ హెచ్ఒ-3, డిసిహెచ్ఎస్-1, గ్రామ సచివాలయ శాఖ-6, విద్య శాఖ-1, ఇతర శాఖలు-26 వినతులు వచ్చాయి. నెల్లిమర్ల శాసన సభ్యురాలు లోకం



మాధవి పలు భోగాపురం అంతార్జతీయ విమానశ్రయం అప్రోచ్ రోడ్లు, ఎం ఎస్ ఎం ఇ పార్కు, మాష్టరు ప్లాన్లు రోడ్లు, యువతకి ఉపాధి అవకాశాలు, నియోజకవర్గ సమస్యలు తదితర ప్రజా సమస్యలపై జిల్లా కలక్టరుకు వినతి పత్రం అందజేసారు. జిల్లా కలక్టరు సమస్యలు సావధానంగా విని, సంబంధిత అధికారులకు వెను వెంటనే తగు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసారు.

డిజిటల్ పర్యవేక్షణ: 1100 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా అందిన కాల్స్ పట్ల బాధ్యతగా వ్యవహరించాలని అధికారులకు జిల్లా కలక్టరు ఆదేశించారు. ప్రతి వారం పి.జి.ఆర్.ఎస్ పురోగతిపై స్వయంగా సమీక్షిస్తానని ఆయన తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీదారును కలిసి, మాట్లాడిన తర్వాతనే ఎండార్స్మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. అర్జీదారునితో మాట్లాడిన తేదీ, సమయం కూడా వారి రిపోర్ట్‌లో నమోదు చేయాలన్నారు. పిజిఆర్ఎస్ టోల్ ఫ్రీ నెంబర్ 1100 పై ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. ఈ నెంబర్‌కు అందిన కాల్స్‌కు కూడా సంబంధిత అధికారి సమాధానం సరైన రీతిలో అందజేయవలసి ఉంటుందన్నారు. ఆర్జిదారుల సమస్యల పరిష్కారంపై సంబంధింత అధికారులను తగు చర్యలు, సత్వర పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక మరియు రెవెన్యు క్లినిక్ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలక్టరు సేతు మాధవన్, జిల్లా రెవెన్యూ అదికారి ఇ.మురళి, స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు డి.వెంకటేశ్వరరావు, రాజేశ్వరి, ప్రమీల గాంధీ, బి.శాంతి, కళావతి, విజయనగరం ఆర్.డి.ఒ. డి.కీర్తి, చీపురుపల్లి ఆర్.డి.ఒ. సత్యవాణి, బొబ్బిలి ఆర్.డి.ఒ.రామ్మోహనరావు, జిల్లా సర్వే, భూమి రికార్డులు శాఖ సహాయ సంచాలకులు ఆర్.విజయకుమార్, కలక్టరేటు పరిపాలనాధికారి దేవి ప్రసాద్, సి.పి.ఒ. బాలజి, జిల్లా పరిషత్ సిఇఒ బి.వి.సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి మణిక్యంయుడు, సర్వశిక్ష అభియాన్ ఎ.పి.సి.రామారావు, సెట్విజ్ సి.ఇ.ఒ విశ్వేశరరావు, వ్యవసాయ శాఖ జెడి వి.టి.రామారావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి అన్నపూర్ణమ్మ, బి.సి.సంక్షేమ అధికారి జ్యోతిశ్రీ, డి.పి.ఒ. మల్లిఖార్జునరావు, పంచాయితీరాజ్ ఎస్.ఇ. ఆర్.డబ్ల్యుఎస్ మరియు ఆర్ అండ్ బి ఎస్.ఇ.లు, ఎపిఈపిడిసిఎల్ ఎస్.ఇ. ఎస్.లక్ష్మణరావు, మార్కఫెడ్ మేనేజరు వెంకటేశ్వరరావు, ఐ.సిడి.ఎస్. పి.డి. విమలరాణి, డిఆర్ డి ఎ పిడి శ్రీనివాస్ పాణి, మైక్రోఇరిగేషన్ పి.డి. లక్ష్మీనారాయణ, హౌసింగు పి.డి., జిల్లా అధికారులు, జిల్లాలో అన్ని మండలాల తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఎస్.వై.ఎం., ఎన్.పి.ఎస్. పింఛన్లను వర్తింపజేయాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి



**విజయనగరం, (రాజధాని వార్తలు):** అసంఘటిత రంగ కార్మికుల సాంఘిక భద్రత కోసం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి శ్రమ యోగి మాన్ధన్, అదేవిధంగా ఇటీవలే చిరు వ్యాపారుల కోసం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి లఘు వ్యాపారి మాన్ధన్ పథకాలను అర్హులందరికీ వర్తింపజేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. ఈ రెండు పథకాలను లక్ష్యం మేరకు ఈ ఏడాది మార్చిలోగా సుమారు 15 వేల మందికి వర్తింప, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కమిటీ సభ్యులకు సూచించారు. ఇప్పటివరకు సుమారు 9,300 మంది ఈ పింఛన్లకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

**26 నుంచి స్పెషల్ డ్రైవ్**

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఈ నెల 26 నుంచి మార్చి 31 వరకు స్పెషల్ డ్రైవర్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దీనికోసం ప్రత్యేకంగా జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కార్యక్రమంలో తాసిల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లును కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. హోటల్లు, దుకాణాలు, వ్యవసాయ పనుల్లో బాల కార్మికులు ఉండే అవకాశం ఉందని, వీటిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిసిఎల్ ప్రసాదరావు, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

# డాక్టర్ ఆదినారాయణకు నివాళులర్పించిన గంటా



**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** పోలియో వ్యాధిగ్రస్తుల జీవితాల్లో వెలుగులు నింపిన పద్మశ్రీ డాక్టర్ సుంకర వెంకట ఆదినారాయణరావు మరణం సమాజానికి తీరని లోటని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పరిషత్ సమీపంలోని అంకోసా భవనంలో ఉంచిన పార్థీవదేహాన్ని ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. డాక్టర్ గా అయిదున్నర దశాబ్దాల కాలంలో 3 లక్షలకు పైగా ఆపరేషన్లు చేసిన ఆదినారాయణను పోలియో వ్యాధిగ్రస్తులకు దైవంగా భావిస్తారని పేర్కొన్నారు. నిస్వార్థ సేవకు ప్రత్యక్ష నిదర్శనమైన ఆదినారాయణ మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

# ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

## - సిపిఎం జిల్లా కార్యదర్శి గొర్లె శ్రీనివాస్


**గజపతినగరం, (రాజధాని వార్తలు):** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి గొర్లె శ్రీనివాస్ అన్నారు. మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేక ప్రచార కార్యక్రమంలో భాగంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బంగారమ్మ పేట, భూదేవి పేట గ్రామాలలో విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును తీసివేయడంతో పాటు ఈ చట్టానికి తూట్లు పొడిచే విధంగా అనేక మార్పులు తీసుకొచ్చారన్నారు. 60 రోజులకు పని దినాలు కుదించారన్నారు. రాష్ట్రాల, పంచాయతీల హక్కులను హరించి, పనులు నిర్ణయించే అధికారం కేంద్ర పెత్తనంలోకి తీసుకోవడం అన్యాయం అన్నారు. ఇలాంటి తరుణంలో భవిష్యత్తు నష్టానికి



వ్యతిరేకంగా కూలీలు, రైతులు అంతా కలిసికట్టుగా పోరాటం చేసి ఉపాధి చట్టాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కె.రాము, కె.గురు వులు, కే.నారాయణ, ఆర్.బంగారమ్మ, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన కదిరి జగన్నాధం

**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** కాంగ్రెస్ పార్టీ మత్స్యకార సెల్ రాష్ట్ర చైర్మన్ కదిరి జగన్నాధం ఆ పదవికి, కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసారు. దీనికి సంబంధించి సోమవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 1992 నుండి కాంగ్రెస్ వాదిగా వుంటూ పార్టీ అప్పగించిన ప్రతీ భాధ్యతను సక్రమముగా నిర్వర్తిస్తూ నేటి వరకు క్రమశిక్షణతో పనిచేసానని, తనను ఆంధ్రప్రదేశ్ ఫిషర్మెన్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించగా ఆ భాద్యతను కూడా స్వీకరించి పార్టీ బలోపేతము చేయుటకు రాష్ట్రములో అన్ని మత్స్యకారుల జిల్లాలు పర్యటించానని, కానీ కొంతకాలముగా కొత్త పి.సి.సి. అధ్యక్షురాలుగా వైఎస్ షర్మిల భాధ్యతలు స్వీకరించిన తరువాత సీనియర్ నాయకులకు తగు ప్రాధాన్యత ఇవ్వకపోగా ఒంటెద్దు పోకడగా ప్రవర్తించుచు పార్టీ ప్రతిష్ఠను భంగం కలిగించే విధముగా వ్యవహరిస్తున్నారని అన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బ తినే విధముగా పత్రికా సమావేశములో మాట్లాడే విధానము మరియు ఇందిరా కాంగ్రెస్ అనే పదాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ రెడ్డి కాంగ్రెస్ అనే శైలిలో వ్యవహరించుట, సీనియర్ నాయకులను అవమాన పరిచే విధముగా ప్రవర్తించుట వలన ఆమె నాయకత్వములో పనిచేయుటకు తన మనస్సు అంగీకరించనందున



కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఆంధ్రప్రదేశ్ ఫిషర్మెన్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో తనకు సహకరించిన నాయకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# బొండపల్లి పీ.ఎస్ వద్ద వాహన తనిఖీలు : ఎస్.ఐ యు మహేష్

## - వాట్సాప్ ఈ గవర్నెన్స్‌పై వాహనదారులకు అవగాహన కల్పించిన ఎస్సై యు.మహేష్





**బొండపల్లి (గజపతినగరం), (రాజధాని వార్తలు):** బొండపల్లి మండల సముదాయాల వద్ద పోలీస్ స్టేషన్ సమీపంలో ఎస్.ఐ యు.మహేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు ఈ తనిఖీలలో భాగంగా వాహనాలపై గతంలో గల చలానా వివరాలను ఎస్.ఐ యు.మహేష్ తనిఖీ చేశారు. వాహన దారులు చలానాలను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు చెల్లించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ యు. మహేష్ మాట్లాడుతూ 9552300009 మొబైల్ నెంబర్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాట్సాప్ ఈ - గవర్నెన్స్ పేరుతో ఒక యాప్‌ను ప్రారంభించిందని అన్నారు. పై మొబైల్ నెంబర్ గల యాప్‌లో హాయ్ అని టైప్ చేయడం ద్వారా ప్రభుత్వం ప్రజలకు కల్పించిన అన్ని శాఖల సేవలన్నింటిని చూడవచ్చునని ఎస్.ఐ యు.మహేష్ అన్నారు.

అదేవిధంగా పోలీస్ సేవలలో భాగంగా ఎఫ్.ఐ.ఆర్ స్టేటస్, ఎఫ్.ఐ.ఆర్ కాపీ, పెండింగ్ ఈ-చలానాలను చెక్ చేసుకోవచ్చునని ఎస్.ఐ యు.మహేష్ అన్నారు. అదేవిధంగా ఇదివరలో చలానాలను మీ-సేవకు వెళ్లి వాహనదారులు చెల్లించేవారని, ఇప్పుడు మీ-సేవకు వెళ్ళవలసిన అవసరం లేదని వాట్సాప్ ఈ- గవర్నెన్స్‌లోకి వెళ్లి ఈ-చలానా ఆప్షన్ ద్వారా తమ మొబైల్‌లోనే పెండింగ్ చలానాలను చెల్లించుకునే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించిందని ఎస్.ఐ యు.మహేష్ అన్నారు. ఈ తనిఖీలలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దేశం గర్వించదగ్గ మహనీయుడు ఎన్టీఆర్ : మంత్రి కొండపల్లి శ్రీనివాసు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** దేశం గర్వించదగ్గ మహనీయుడు, మహానేత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు అన్న ఎన్టీఆర్ అని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన స్థానిక జాతీయ రహదారి వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకుముందు ఆయన పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీతో ఎన్టీఆర్ విగ్రహం వద్దకు వచ్చారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు,పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత దేశం గర్వించదగ్గ నాయకుల్లో ఎన్టీఆర్ ఒకరన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమము కోసం పాటుపడిన మహనీయుడు అన్నారు. ఆంధ్రులు ఆరాధ్య దైవంగా కీర్తించబడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పి.వి.వి. గోపాలరాజు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మక్కువ శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, చప్ప చంద్రశేఖర్, కొండపల్లి భాస్కరరావు, సీరంరెడ్డి రామ్ కుమార్, దత్తిరాజేరు మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ, చినకాద గ్రామ పార్టీ నాయకులు శిరువూరి నారాయణ మూర్తి రాజు, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**కే.ఏ. నాయుడు ఆధ్వర్యంలో :**

అలాగే మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కె.ఎ.నాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక జాతీయ రహదారి వద్దగల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఎవరికి వారు వేరువేరుగా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు చేపట్టడం స్థానికంగా చర్చనీయాంశం అయింది. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బండారు బాలాజీ, మాజీ ఏఎంసీ చైర్మన్ చంటిరాజు, ఎడ్ల గోపి, లెంక స్వామి నాయుడు, గుసిడి జగన్నాథం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎష్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మీ సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్‌పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# పారదర్శకంగా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్, డిఆర్డిఏ పిడి నాగరాజు కుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిడి నాగశేఖర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి శ్రీధర్ రెడ్డి, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు మరియు పింఛన్లకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు సవివరంగా వివరించాల న్నారు. ప్రజా సమస్య పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను బియాండ్ యస్.యల్.ఏ పోకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లును జిల్లా అధికా రులు చేపట్టారు. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా మరియు మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగు నీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ, ప్రత్యేక క్యూ లైన్లు తదితర ఏర్పాట్లు చేయడంతపాటు షామ్యానలు వేసి నీడను కల్పించారు. సోమవారం జరిగిన ప్రజాపిర్యాదుల పరిష్కార వేదికలో నూతనంగా ఫిర్యాదుల స్వీకరణ త్వరితగతిన పరిష్కారానికి డివిజనుల వారీగా రెవెన్యూ క్లినిక్ ప్రత్యేక కౌంటర్లను తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసి అర్జీల సత్వర పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కాకిలేటి మణికంఠ కుటుంబాన్ని పరామర్శించిన జనసేన నాయకులు



**అల్లవరం, (రాజధాని వార్తలు):** జనసేన పార్టీ విజయానికి ఎనలేని కృషి చేసిన కాకిలేటి మణికంఠ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను జనసేన పార్టీ నాయకులు సోమవారం పరామర్శించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం, సామంతకుర్రు గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు, పార్టీ ప్రారంభం నుండి పార్టీ అభివృద్ధి ఎంతో కృషి చేసిన మాజీ జనసేన పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు కాకిలేటి మణికంఠ (బాబీ) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన అకాల మరణం బాధాకరమని జనసేన పార్టీ నేతలు సోమవారం ఆయన స్వగృహం వద్ద కుటుంబ సభ్యులను పరామర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. నల్లా శ్రీధర్, యాళ్ల సతీష్, కటికరెడ్డి బాబి, కంకిపాటి వీరబాబు, పోలిశెట్టి బాబులు, కాకిలేటి హరికృష్ణ, తిక్కిరెడ్డి శ్రీనివాస్, రొక్కాల నాగేశ్వరరావు, కంకిపాటి గోపి, పిల్లా ప్రసాద్, చికలే చిట్టిబాబు, నల్లా రాము, పోలమూరి బాబురావు, బిందాస్, ఆకుల సతీష్, నామాడి నాగరాజు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

# జాఫర్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం : మంత్రి ఆనం



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన తెలుగుదేశం పార్టీ మైనార్టీ యువ నేత మహమ్మద్ జాఫర్ షరీఫ్ (జాకీర్) మృతి తనను తీవ్రంగా కలచివేసిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జాఫర్ అకాల మరణం తెలుగుదేశం పార్టీకి మాత్రమే కాదు, మైనార్టీ సమాజానికి కూడా తీరని లోటుగా మిగిలిపోయిందని అన్నారు. నెల్లూరు నగరం ఖుద్దూస్ నగర్‌లోని జాఫర్ నివాసానికి వెళ్లిన మంత్రి ఆనం,.. శోకసంతప్త కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధాతప్త హృదయంతో ఉన్న వారు కుటుంబాన్ని ఓదార్చుతూ, ఈ కఠిన సమయంలో తెలుగుదేశం పార్టీ సంపూర్ణంగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జాఫర్ ఒక సాధారణ కార్యకర్తగా ప్రారంభమై, తన నిబద్ధతతో మైనార్టీ సెల్‌లో చురుకైన యువ నాయకుడిగా ఎదిగారని మంత్రి గుర్తు చేశారు. కార్యకర్తలతో కలిసిమెలిసి పనిచేస్తూ, పార్టీ బలోపేతమే లక్ష్యంగా నిరంతరం శ్రమించిన నిజాయితీ గల నాయకుడిగా ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ముస్లిం సమాజంలో తెలుగుదేశం పార్టీకి బలమైన స్వరం జాఫర్‌గా నిలిచారని ప్రశంసించారు. పార్టీ, ప్రజాసేవ పట్ల జాఫర్ చూపిన అంకితభావం రాబోయే తరాల కార్యకర్తలకు మార్గదర్శకంగా నిలుస్తుందని మంత్రి ఆనం తెలిపారు. ఈ విషాదాన్ని భరించే శక్తిని కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థిస్తూ, జాఫర్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, మైనార్టీ సెల్ ప్రతినిధులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# పి.ఆర్ ప్రభుత్వ కళాశాలలో జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



**కాకినాడ, (రాజధాని వార్తలు):** పిఆర్ ప్రభుత్వ కళాశాలలో కంపిటేషనల్ ఇన్నోవేషన్స్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశంపై ఈ నెల 24వ తారీఖున ఒకరోజు జాతీయ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను కళాశాల ప్రిన్సిపల్ ఆంజ నేయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ జాతీయ సదస్సులు సమకాలిన పరిశోధనా అంశాలు మరియు వివిధ పరిశోధనలపై జరుగుతున్న అభివృద్ధి మరియు ఆ పరిశోధన యొక్క అనువర్తనాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి ఉపయోగపడతాయని తెలియజేశారు. ఈ జరగబోయే జాతీయ సదస్సు భౌతిక శాస్త్రం గణిత శాస్త్రం కంప్యూటర్ సైన్స్ మరియు కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగాల ఆధ్వర్యంలో ఈ నెల 24న జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా గణిత శాస్త్ర విభాగాధిపతి డా. కే జయదేవ్ మరియు ఆర్గనైజింగ్ సెక్రటరీగా భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఎం సురేఖ ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ ఏసీ సమన్వయకర్త పి హరి రాం ప్రసాద్, జంతు శాస్త్ర విభాగాధిపతి బి చక్రవర్తి, డా కె లక్ష్మణరావు, డా.ఎస్ వి జి వి ఏ ప్రసాద్, ఆర్ వి సత్యనారాయణ, పి జ్యోతి పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan